RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | గురువారం, సెప్టెంబరు 10, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 130 | పేజీలు: 8 | వెల : రూ.1



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే సస్పెన్షన్

# కాంగ్రెస్‌లో రేవంత్‌కు పెరుగుతున్న పట్టు?

### వరుస షోకాజ్ నోటీసులతో క్రమశిక్షణకు ప్రాధాన్యం..

### అసమ్మతి స్వరాలపై అధిష్టానం కఠిన వైఖరి?



హైదరాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవలి పరిణామాలు పార్టీ అంతర్గత వ్యవహారాల్లో మార్పుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. గతంలో నేతలు బహిరంగంగా పరస్పర విమర్శలు చేసుకోవడం, ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తిని వ్యక్తం చేయడం వంటి ఘటనలు తరచూ కనిపించేవి. అయితే తాజాగా పార్టీ క్రమశిక్షణా చర్యలు వేగం పుంజుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. టీపీసీసీ డిసిప్లినరీ యాక్షన్ కమిటీ వరుసగా షోకాజ్ నోటీసులు జారీ చేస్తుండటం ఈ మార్పుకు ప్రధాన ఉదాహరణగా నిలుస్తోంది. నాగర్‌కర్నూల్ ఎంపీ, కమిటీ చైర్మన్ మల్లు రవి నేతృత్వంలో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనలకు సంబంధించి పలువురు నేతల నుంచి వివరణ కోరుతున్నారు.

**ఒకేరోజు తొమ్మిది మందికి నోటీసులు**

ఇటీవల ఒకేరోజు తొమ్మిది మంది నేతలకు షోకాజ్ నోటీసులు జారీ కావడం గాంధీభవన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి ఘటనకు సంబంధించి ఐదుగురు స్థానిక నేతలకు, గజ్వేల్ ఘర్షణలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఆదిలాబాద్ రాజకీయ వివాదానికి సంబంధించి కంది శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డిల వివరణ కూడా కోరినట్లు

(మిగతా 2వ పేజీలో)



## గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.. సీపీ సజ్జనర్ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 9: గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్ ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం ఆయన అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ సీపీ (ఎల్అండ్‌వో) తఫ్సీర్ ఇక్బాల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, జాయింట్ సీపీ (స్పెషల్ బ్రాంచ్) ఎస్.ఎం. విజయ్‌కుమార్, జాయింట్ సీపీ (ఫ్యూచర్ సిటీ) చందనా దీప్తితో పాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్లు, హైడ్రా, ఆర్టీసీ, ఫైర్ సర్వీసెస్, వైద్య, విద్యుత్, రవాణా, ఆర్అండ్‌బీ, వాటర్‌వర్క్స్,

(మిగతా 2వ పేజీలో)



### తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త..

## పీఆర్సీపై ప్రభుత్వం కీలక అడుగు

### నివేదిక త్వరగా ఇవ్వాలని పీఆర్సీ చైర్మన్‌కు సీఎస్ లేఖ..

### బకాయి డీఏలు, ఫిట్‌మెంట్‌పై ఉద్యోగ సంఘాల ఒత్తిడి

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్య చేపట్టింది. రెండో వేతన సవరణ కమిషన్ నివేదికను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పీఆర్సీ చైర్మన్ ఎన్. శివశంకర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. కమిషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో నివేదిక సమర్పణ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం సూచించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**గడువు ముగుస్తున్న వేళ..**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కోసం ప్రభుత్వం రెండో వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఉద్యోగుల వేతనాలు, భత్యాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసులు చేయడం కమిషన్ ప్రధాన బాధ్యత. ప్రస్తుతం కమిషన్ గడువు ముగియనున్న నేపథ్యంలో నివేదిక సమర్పణపై ప్రభుత్వం దృష్టి సారించింది. కమిషన్ నివేదిక అందిన తర్వాత దానిని పరిశీలించి ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో పీఆర్సీ ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందన్న అంశంపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు వేతన సవరణ అమలుపై ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలను విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు

(మిగతా 2వ పేజీలో)

## రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాసిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై వినూత్నంగా నిరసన
- రూ.15 వేల కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ
- విద్యార్థులకు మద్దతిస్తే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని విమర్శ
- కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చలేదని విమర్శలు



## కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు: మహేశ్ గౌడ్

- కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్
- కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎం రేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి
- కేసీఆర్‌కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉందని వివరణ
- సిరిసిల్లలో సీఎం రేవంత్‌కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు



## హైదరాబాద్ హాస్టళ్లకు 'హైడ్రా' స్ట్రిక్ట్ వార్నింగ్.. 3 నెలలే డెడ్‌లైన్!

- హైదరాబాద్‌లో నిబంధనలు పాటించని హాస్టళ్లపై హైడ్రా ఉక్కుపాదం
- ప్రమాదకర భవనాలను ఖాళీ చేసేందుకు 3 నెలల గడువు
- వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రత్యేక తనిఖీలు
- విద్యార్థుల భద్రతతో రాజీపడొద్దని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం



# మైలేజ్ ఎవరికి.. డ్యామేజ్ ఎవరికి?

### అసెంబ్లీ తొలిరోజు నిరసనలు.. పోలీసులతో తోపులాట.. తాతా మధు వ్యాఖ్యలతో రాజకీయ దుమారం




హైదరాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజు అసెంబ్లీ వెలుపల చోటుచేసుకున్న పరిణామాలు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదానికి దారితీశాయి. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళన సందర్భంగా పోలీసులతో తోపులాట జరగడం, అనంతరం ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మరింత విస్తరించింది. సమావేశాల ప్రారంభానికి ముందు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల దుస్తులు ధరించి ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అసెంబ్లీ వద్ద పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో తమ పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలు,

(మిగతా 2వ పేజీలో)



### ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..

## ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ



వాయిస్ ఆఫ్ ప్రజలు

గురువారం, సెప్టెంబరు 10, 2026

# గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

హెచ్ఎండీఏ, మెట్రో, ఎంఎంటీఎస్ తదితర శాఖల ప్రతినిధులు తమ ఏర్పాట్లను వివరించారు.

### విద్యుత్ వైర్లపై ప్రత్యేక దృష్టి

గత ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సీపీ సజ్జనర్ సూచించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో రోడ్లకు అడ్డంగా ఉన్న విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించి తగిన క్లియరెన్స్ ఉండేలా చూడాలని ఆదేశించారు. గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేశ్ మండపాలకు నిబంధనల ప్రకారం సురక్షిత విద్యుత్ కనెక్షన్లు అందించాలని, ఎర్తింగ్ పూర్తి చేసి ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టరేట్ అనుమతులు పొందేలా చూడాలని తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేత లేదా వైర్ల తొలగింపు వంటి చర్యలకు ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రధాన నిమజ్జన మార్గాలు, ఫీడర్ రూట్లలో కొనసాగుతున్న రోడ్డు, నాలా, స్లాబ్ పనులను లిసెప్టెంబర్ 14, 15 నాటికిలి పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు కొత్తగా రోడ్ల తవ్వకాలు, కేబుల్ పనులు చేపట్టవద్దని సూచించారు. పాతబస్తీలో మెట్రో పనులకు సంబంధించి విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### 24 గంటల వైద్య సేవలు

ఉత్సవాల సందర్భంగా ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో లి26 ప్రాంతాల్లోలి, బాలాపూర్ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్సులు, పారామెడికల్ సిబ్బందిని 24 గంటలూ అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులను కోరారు.

### ట్రాఫిక్.. పార్కింగ్ ఏర్పాట్లు

నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు తగిన పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులు సూచించారు. ఆర్టీసీ, రవాణా శాఖలు అవసరమైన సంఖ్యలో బస్సులు, గూడ్స్ వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నిమజ్జనం రోజున వినియోగించే క్రేన్లు, ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, మెయింటెనెన్స్ బృందాల వివరాలను ముందుగానే పోలీసులకు అందించాలని సూచించారు.

### మెట్రో.. ఎంఎంటీఎస్ సేవల పొడిగింపు

సెప్టెంబర్ 25న జరిగే ప్రధాన గణేశ్ నిమజ్జనంలి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో రైలు సేవలను అర్ధరాత్రి లి1 గంట వరకులి కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా నాంపల్లి, లక్డీకాపూల్, ఖైరతాబాద్, సంజీవయ్య పార్క్, జేమ్స్ స్ట్రీట్, బేగంపేట్ స్టేషన్ల నుంచి రాత్రంతా ఎంఎంటీఎస్ రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు నిమజ్జన ఏర్పాట్లు, మార్గాలు, ట్రాఫిక్ మార్పులు, బడా గణేశ్ దర్శన ముగింపు తదితర సమాచారాన్ని టీవీ స్క్రోలింగ్‌లు, పత్రికల ద్వారా విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు.

# కాంగ్రెస్‌లో రేవంత్‌కు పెరుగుతున్న పట్టు?

తెలుస్తోంది. పార్టీ నేతలు బహిరంగ వివాదాలకు దూరంగా ఉండాలనే సంకేతాన్ని ఈ చర్యల ద్వారా నాయకత్వం ఇస్తోందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

### అధిష్టానం నుంచి స్వేచ్ఛ?

పార్టీలో క్రమశిక్షణ చర్యలు పెరగడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ నాయకత్వానికి కాంగ్రెస్ అధిష్టానం ఎక్కువ స్వేచ్ఛ ఇచ్చిందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణపై అంచనాలు కొనసాగుతున్న సమయంలో కొందరు సీనియర్ నేతలు చేసిన వ్యాఖ్యలు కూడా ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వంటి సీనియర్ నేతలు గతంలో చేసిన ఘాటు వ్యాఖ్యల అనంతరం ముఖ్యమంత్రి సమావేశాల్లో పాల్గొనడం కూడా పార్టీ అంతర్గత సమన్వయంపై చర్చకు దారితీసింది.

### క్రమశిక్షణకు ప్రాధాన్యం

పార్టీ నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకించడం, నేతలపై విమర్శలు చేయడం వంటి అంశాలను ఇకపై కఠినంగా పరిగణించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ చర్యలు పూర్తిగా ముఖ్యమంత్రి నిర్ణయాల ఆధారంగానే జరుగుతున్నాయనే అభిప్రాయానికి బదులుగా.. పార్టీ అధిష్టానం మార్గదర్శకత్వంలో టీపీసీసీ క్రమశిక్షణా వ్యవస్థ పనిచేస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అధిష్టానం ప్రతినిధి మీనాక్షి నటరాజన్ మార్గదర్శకత్వంలో పార్టీ వ్యవహారాలను సమన్వయం చేస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ ఉంది. దీంతో సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవనే సంకేతం వెళ్లినట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

### స్థానిక పోరుకు ముందు వ్యూహాత్మక అడుగులా?

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, అంతర్గత విభేదాలను తగ్గించడం కాంగ్రెస్ నాయకత్వానికి కీలకంగా మారనుందని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్‌లో చాలాకాలంగా ఉన్న అంతర్గత విభేదాలను కేవలం క్రమశిక్షణ చర్యలతో పూర్తిగా పరిష్కరించడం సాధ్యమా అన్నది కూడా ప్రశ్నగానే ఉంది. వరుస నోటీసులతో నేతలు బహిరంగ వ్యాఖ్యలకు దూరంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ.. దీర్ఘకాలికంగా పార్టీ ఐక్యతకు ఇది ఎంతవరకు దోహదపడుతుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది. మొత్తంగా.. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు ప్రాధాన్యం పెరగడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి అధిష్టానం మద్దతు మరింత స్పష్టమవుతోందనే చర్చకు దారితీస్తోంది. అయితే ఈ క్రమశిక్షణా చర్యలు పార్టీని మరింత ఐక్యంగా మారుస్తాయా.. లేక అసమ్మతి స్వరాలు మరో రూపంలో బయటకు వస్తాయా అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాసిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టిని ఆకర్షించేందుకు బీజేపీ సీనియర్ నాయకులు ఎన్. రామచందర్ రావు వినూత్న నిరసన చేపట్టారు. బుధవారం ఆయన రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాశారు. రాష్ట్రంలో సాగుతున్న ఆందోళనలు, విద్యార్థుల నిరసనలు, పోలీసుల లాఠీఛార్జులు, అరెస్టులు వంటివేవీ రాహుల్ గాంధీని గానీ, తెలంగాణ ప్రభుత్వాన్ని గానీ కదిలించలేకపోయాయని, అందుకే ఆయన "మాతృభాష" అయిన ఇటాలియన్‌లో లేఖ రాస్తున్నట్లు రామచందర్ రావు ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫలితంగా విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కొరతతో విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, సిబ్బంది కూడా అరకొర వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యార్థులకు మద్దతుగా నిలిస్తే రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు, పోలీసు చర్యలతో అణచివేస్తోందని రామచందర్ రావు విమర్శించారు. సమస్య పరిష్కారం కోసం గళమెత్తినందుకు గత 10 రోజుల్లోనే తనను నాలుగుసార్లు అరెస్టు చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'యూత్ డిక్లరేషన్'లో ఇచ్చిన నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, విద్యా భరోసా కార్డుల వంటి హామీలను నెరవేర్చలేదని ఆయన దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి బకాయిలన్నీ విడుదల చేయించాలని, విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోవాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త.. పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు

డిమాండ్ చేస్తున్నాయి. అలాగే పీఆర్‌సీ నివేదిక ఆధారంగా ఫిట్‌మెంట్‌ను ప్రకటించి వేతన సవరణను అమలు చేయాలని కోరుతున్నాయి. వేతన సవరణ ఆలస్యం కావడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పీఆర్‌సీ నివేదికపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

### నివేదిక తర్వాత కీలక నిర్ణయం

పీఆర్‌సీ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం అందులోని సిఫారసులను ప్రభుత్వం పరిశీలించనుంది. ఉద్యోగుల వేతనాలు, ఫిట్‌మెంట్, ఇతర ప్రయోజనాలకు సంబంధించి తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి తాజాగా వచ్చిన లేఖతో పీఆర్‌సీ ప్రక్రియలో కదలిక మొదలైందని ఉద్యోగ వర్గాలు భావిస్తున్నాయి. నివేదిక త్వరగా అందితే వేతన సవరణపై ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని ఉద్యోగులు ఆశిస్తున్నారు.

### ఉద్యోగుల్లో ఆశలు

రెండో పీఆర్‌సీ గడువు ముగుస్తున్న సమయంలో ప్రభుత్వం నివేదికను త్వరగా సమర్పించాలని కోరడం ఉద్యోగుల్లో ఆశలు పెంచింది. ఇప్పటికే బకాయి డీఏలు, వేతన సవరణ, ఫిట్‌మెంట్ అంశాలపై ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం తీసుకున్న తాజా చర్య ప్రాధాన్యం సంతరించుకుంది. పీఆర్‌సీ నివేదిక ఎప్పుడు అందుతుంది? ప్రభుత్వం దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఫిట్‌మెంట్ ఎంత మేరకు ఉండనుంది? బకాయి డీఏల విడుదలపై ఎలాంటి చర్యలు ఉంటాయి? అనే అంశాలపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. కమిషన్ నివేదిక సమర్పణతో ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే సస్పెన్షన్

**ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం.. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం**

**అసెంబ్లీలోకి అనుమతించకపోయినా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**



హైదరాబాద్, సెప్టెంబర్ 9: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అడిగే ప్రశ్నలకు, లేవనెత్తే అంశాలకు సమాధానం చెప్పలేకే వారిని సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన లి420 హామీలు, ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లనులి అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్నింటినీ అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారని.. అయితే 33 నెలలు, సుమారు 1,000 రోజులు గడిచినా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క విషయంలోనూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు.

### డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపణ

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటంతో అధికార కాంగ్రెస్ దిక్కుతోచని పరిస్థితిలో ఉందని రవిచంద్ర అన్నారు. ప్రజా సమస్యలు, హామీల అమలు అంశాల నుంచి దృష్టి మళ్లించేందుకు 'డైవర్షన్ పాలిటిక్స్'కు పాల్పడుతూ వివిధ అంశాలను తెరపైకి తీసుకొస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

### ప్రజాక్షేత్రంలో పోరాటం

బీఆర్ఎస్ సభ్యులను అసెంబ్లీలోకి అడుగుపెట్టకుండా అడ్డుకున్నప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని రవిచంద్ర స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే అవకాశం లేకపోయినా.. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని ఆయన తెలిపారు.

## హైదరాబాద్ హాస్టళ్లకు 'హైడ్రా' స్ట్రిక్ట్ వార్నింగ్.. 3 నెలలే డెడ్‌లైన్!



హైదరాబాద్ నగరంలోని హాస్టళ్ల భద్రతపై హైడ్రా కఠిన నిబంధనలు జారీ చేసింది. సురక్షితం కాని, అనుమతులు లేని భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లను మూడు నెలల్లోగా సురక్షితమైన భవనాల్లోకి మార్చాలని నిర్వాహకులకు అల్టిమేటం ఇచ్చింది. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి తనిఖీలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రమాదకర భవనాలను కూల్చివేస్తామని స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధ్యక్షతన హాస్టళ్ల నిర్వాహకులు, భవన యజమానులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టళ్లలో నివసించే విద్యార్థులు, ఉద్యోగుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రతి హాస్టల్‌లో అగ్నిమాపక భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, నిర్మాణ పటిష్ఠత తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లు నడిపేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు మరణించడం, ఢిల్లీలో హాస్టల్ భవనం కూలి పలువురు చనిపోవడం వంటి ఘటనల నేపథ్యంలో హైడ్రా ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది. అనుమతులు లేని భవనాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించేందుకు మూడు మున్సిపల్ కార్పొరేషన్లతో సమన్వయం చేసుకుంటామని రంగనాథ్ తెలిపారు. కేవలం లాభార్జన కోసం భద్రతను విస్మరించవద్దని, హాస్టల్ వాసులను తమ సొంత బిడ్డల్లా భావించి వసతులు కల్పించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య అగ్నిప్రమాదాలు నివారణ చర్యల, ఫైర్ సేఫ్టీ నిబంధనలపై వీడియోల ద్వారా నిర్వాహకులకు సమగ్ర అవగాహన కల్పించారు.

## కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు: మహేశ్ గౌడ్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు సీఎం స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. సీఎం తర్వాత రాష్ట్రంలో అత్యధిక భద్రత పొందుతున్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంతవరకు సమంజసమని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. స్పీకర్ పదవిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలపైనా ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను తెలంగాణ సమాజం ఖండిస్తోందన్నారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని చెప్పారు. కేసీఆర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# మైలేజ్ ఎవరికి.. డ్యామేజ్ ఎవరికి?

ఇతర ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

### పోలీసుల వైఖరిపై బీఆర్ఎస్ ఆరోపణలు

తోపులాట సందర్భంగా కొందరు బీఆర్ఎస్ నేతలు గాయపడ్డారని, మహిళా ఎమ్మెల్యేలు కూడా తమకు ఎదురైన పరిస్థితులను వివరించారని ఆ పార్టీ నేతలు తెలిపారు. పోలీసుల చర్యను ప్రశ్నిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ నేతలే పోలీసులతో తోపులాటకు దిగారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకోవడం, తోపులాటకు దిగడం వంటి దృశ్యాలు ఘటనకు సంబంధించిన వీడియోల్లో కనిపిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

### వీడియోలపై ఇరుపక్షాల వాదనలు

ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కాంగ్రెస్ నేతలు ప్రస్తావిస్తూ.. పోలీసులు తమ విధుల్లో భాగంగానే వ్యవహరించారని వాదించారు. బీఆర్ఎస్ నేతలు మాత్రం పోలీసుల చర్యల కారణంగానే పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని ఆరోపించారు. దీంతో ఘటనకు సంబంధించి ఇరుపక్షాలు తమ వాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశాయి. వీడియో దృశ్యాల పూర్తి సందర్భం, ఘటనకు దారితీసిన పరిస్థితులపై మరింత స్పష్టత అవసరమనే అభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యాయి.

### తాతా మధు వ్యాఖ్యలపై వివాదం

ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వ్యాఖ్యలు మరో వివాదానికి దారితీశాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ పదవికి, శాసనసభ గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను సమర్థించలేమని అధికారపక్ష నేతలు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై తాతా మధు వివరణ ఇస్తూ.. తాను స్పీకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని, పోలీసుల వ్యవహారశైలిపై మాట్లాడినట్లు తెలిపారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా మనస్తాపానికి గురై ఉంటే వాటిని ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించారు.

### రాజకీయంగా కొత్త చర్చ

ఒకవైపు పోలీసుల వైఖరిపై బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తుండగా.. మరోవైపు పోలీసులతో జరిగిన ఘర్షణ, తాతా మధు వ్యాఖ్యలను కాంగ్రెస్ ప్రధాన అంశాలుగా తీసుకుంది. దీంతో అసెంబ్లీ సమావేశాల తొలి రోజు రాజకీయ చర్చ ప్రధానంగా ఈ ఘటనల చుట్టూనే సాగింది. ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు ప్రతిపక్షం చేపట్టిన నిరసనలకు ఎంత మేర రాజకీయ ప్రయోజనం లభించింది? అదే సమయంలో చోటుచేసుకున్న వివాదాలు ఆ పార్టీపై ఎలాంటి ప్రభావం చూపాయి? అన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### ముందుముందు పరిణామాలపై ఆసక్తి

అసెంబ్లీ సమావేశాలు ఇంకా కొనసాగనున్న నేపథ్యంలో ఈ ఘటనల ప్రభావం రాబోయే చర్చలపై ఎంతవరకు ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ తమ వాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో.. తదుపరి రోజుల్లో అసెంబ్లీ వేదికగా రాజకీయ చర్చలు మరింత వేడెక్కే అవకాశం ఉంది. తొలిరోజు జరిగిన పరిణామాల్లో ఇరుపక్షాలు తమ వాదనలను బలంగా వినిపించాయి. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న కొద్దీ ఈ వివాదం రాజకీయంగా ఏ స్థాయికి వెళ్తుందనేది చూడాల్సి ఉంది.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..


# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### విద్యార్థులతో మానవహారం - ప్రభుత్వానికి భాగ్యరథి డిగ్రీ కళాశాల డిమాండ్




కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 9(వాయిస్ టుడే): టీపీడీఎంఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉద్యమంలో భాగంగా ఈరోజు భాగ్యరధి డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బందితో కలిసి మానవహారం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, టీచింగ్ మరియు నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొని విద్యార్థుల సమస్యలకు తమ మద్దతు తెలిపారు. డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతో కీలకమని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఫీజులు చెల్లించలేక కొంతమంది విద్యార్థులు ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌లు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని అన్నారు. లెక్చరర్లు మరియు కాలేజీ సిబ్బందిపై కూడా ఈ పరిస్థితి ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో కాలేజీల ఆర్థిక పరిస్థితి దెబ్బతిని, సిబ్బందికి జీతాలు, విద్యా వనరులు, నిర్వహణ ఖర్చులు వంటి అంశాల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు.

కాలేజీలకు నిధులు సకాలంలో అందకపోతే విద్యార్థులకు అందించాల్సిన నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, డిజిటల్ విద్యా సదుపాయాలు మరియు ఇతర విద్యా కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కాలేజీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసే విధంగా స్పష్టమైన విధానం రూపొందించాలని టీపీడీఎంఏ తరపున ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, టీచింగ్ స్టాఫ్, నాన్-టీచింగ్ స్టాఫ్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## రేప్, పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

### రూ.3 వేల జరిమానా.. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం

గచ్చిబౌలి, సెప్టెంబర్ 9 (వాయిస్ టుడే): అత్యాచారం, పోక్సో కేసులో 42 ఏళ్ల వ్యక్తికి రాజేంద్రనగర్‌లోని అత్యాచారం, పోక్సో కేసుల విచారణకు ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. గచ్చిబౌలి పోలీసులు నమోదు చేసిన కేసులో బుధవారం (సెప్టెంబర్ 9, 2026) న్యాయమూర్తి టీ. శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. క్రైమ్ నంబర్ 642/2023, ఎస్సీ నంబర్ 313/2023 కేసులో కొండాపూర్ రాఘవేంద్ర కాలనీకి చెందిన సెంట్రింగ్ కార్మికుడు మీనగల వేణుగోపాల్ అలియాస్ వేణును కోర్టు దోషిగా నిర్ధారించింది. ఐపీసీ సెక్షన్ 376బీ, 506, పోక్సో చట్టం-2012లోని సెక్షన్లు 5(ఎ), 5(ఐ) రెడ్ విత్ 6, ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంలోని సెక్షన్ 3(2)(ఐ) కింద నిందితుడికి శిక్ష విధించింది. నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.3,000 జరిమానా విధించిన కోర్టు, బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసును తొలుత మాదాపూర్ డివిజన్ ఏసీపీ సీహెచ్ రఘునందన్ రావు దర్యాప్తు చేయగా, అనంతరం మాదాపూర్ డివిజన్ ఏసీపీ పి. శ్రీనివాస్ దర్యాప్తును కొనసాగించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే. సైదులు కేసు దర్యాప్తు, తదుపరి చర్యలను పర్యవేక్షించారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. వెంకటేశ్వర్ రెడ్డి వాదనలు వినిపించారు. సీడీఓ సురేఖతో పాటు ప్రాసిక్యూషన్ లైజన్, కేసు బ్రీఫింగ్‌లో పాల్గొన్న పోలీసు సిబ్బంది నిందితుడికి శిక్ష పడేలా సహకరించారు.

## దుండిగల్ సర్కిల్ గాగిలాపూర్ లోని అక్రమ నిర్మాణం పై సర్కిల్ అధికారుల చర్యలు



కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 9(వాయిస్ టుడే): దుండిగల్ సర్కిల్ పరిధిలోని చర్చి గాగిలాపూర్ ప్లాట్ నెం. 116 , సర్వేనెంబర్ 192 లో ఎస్ ‌o2 పర్మిషన్ తీసుకొని ఎస్ o3 నిర్మిస్తున్న అనధికార అంతస్తును అధికారులు కూల్చివేతలూ చేపట్టినారు ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే ఏ నిర్మాణాన్ని కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిఘా తీవ్రతరం దుండిగల్ సర్కిల్ పరిధిలో తక్కువ గజాలలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనకు చెక్ అనుమతులు ఒకలా తీసుకొని, అదనంగా అనధికారిక నిర్మాణాలు (ఉన్నాయూతో?రైజెడ్ కన్స్ట్రక్షన్స్ ) చేపడుతున్న వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. భారీ కూల్చివేతలు ఖాయం ఇలాంటి అనధికార నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటూ డిమాలిషన్లు కొనసాగిస్తామని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టిపిఎస్ ముఖేష్ సింగ్ మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## సభాపతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీల సభ్యత్వం రద్దు చేయాలి

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 9(వాయిస్ టుడే): తూముకుంట: శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు తాత మధుసూదన్, నవీన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో తూముకుంటలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం శాసనసభ గౌరవాన్ని కించపరచడమేనని అన్నారు. ఒక దళిత వర్గానికి చెందిన వ్యక్తి శాసనసభాపతి పదవిలో ఉండటాన్ని అవమానించే విధంగా మాట్లాడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీలు తాత మధుసూదన్, నవీన్ రెడ్డిల వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, శాసనసభ గౌరవానికి విరుద్ధంగా ఉన్నాయని శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీల సభ్యత్వాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక దళిత వర్గానికి చెందిన సభాపతిని కించపరిచే ధోరణి బిఆర్ఎస్ పార్టీ దొరల అహంకారానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. శాసనసభ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికకు గౌరవం కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని, వ్యక్తిగత రాజకీయ విమర్శలు హద్దులు దాటి రాజ్యాంగ పదవులను అవమానించే స్థాయికి చేరకూడదని శ్రీశైలం గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, అజయ్ యాదవ్ తదితరులు, దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుదాం.. మట్టి గణపతులను పూజిద్దాం

### ప్రజలకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపు




శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 9 (వాయిస్ టుడే): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లిలోని మసీద్‌బండ బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలోని ఆర్‌కేవై ఫౌండేషన్ నిర్వహించిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రవికుమార్ యాదవ్ గత ఐదేళ్లుగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది కూడా కార్యక్రమాన్ని కొనసాగించడం అభినందనీయమన్నారు.

గణేష్ చతుర్థి దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ అని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. పీఓపీ విగ్రహాల కారణంగా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా మట్టి గణపతి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న రవికుమార్ యాదవ్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమం రానున్న సంవత్సరాల్లోనూ కొనసాగాలని ఆకాంక్షించారు. మాజీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇళ్లలో, వీధుల్లో, బస్తీల్లో, కాలనీల్లో, అపార్ట్‌మెంట్లలో, గేటెడ్ కమ్యూనిటీల్లో పీఓపీ విగ్రహాల వినియోగాన్ని తగ్గించి మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే ప్రారంభించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీఓపీ విగ్రహాల నిమజ్జనం వల్ల చెరువులు, కుంటలు కలుషితమవుతాయని, మట్టి విగ్రహాలు నీటిలో సహజంగా కరిగిపోయి పర్యావరణంలో కలిసిపోతాయని వివరించారు. ప్రతి కాలనీ, ప్రాంతం, వీధి, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీలో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, మాణిక్‌రావు, రమేష్ నాయక్, మహేష్, అనూష యాదవ్, రాజేష్ గౌడ్, లక్ష్మణ్, గణేష్ ముదిరాజ్, రవి నాయక్, అంజనేయులు, సాగర్, రాజు యాదవ్, జితేందర్, బాలు యాదవ్, పద్మ, మేరీ, కవిత, లక్ష్మి, భూపాల్ రెడ్డి, రాజిరెడ్డి, పట్టాభిరామ్ పాల్గొన్నారు.




## అనధికార నిర్మాణాలపై సీఎంసీ కొరడా

సైబరాబాద్, సెప్టెంబర్ 9 ( వాయిస్ టుడే): అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులు చర్యలను ముమ్మరం చేశారు. మూడు జోన్ల పరిధిలో ఫీల్డ్ స్థాయి బృందాలు తనిఖీలు నిర్వహిస్తూ అనధికార నిర్మాణాలను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాయి. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 19 అనధికార నిర్మాణాలను గుర్తించగా, 17 నిర్మాణాలను కూల్చివేశారు. మరో 10 నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. కూల్చివేతల్లో శేరిలింగంపల్లి జోన్‌లో 5, కూకట్‌పల్లి జోన్‌లో 6, కుత్బుల్లాపూర్ జోన్‌లో 6 నిర్మాణాలు ఉన్నాయి. గుర్తించిన అనధికార నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, గుర్తింపు, పరిశీలన నుంచి తదుపరి చర్యల వరకు కేసులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సీఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. అనధికార నిర్మాణాలను అరికట్టడంతో పాటు భవన నిర్మాణ నిబంధనలు పాటించేలా మూడు జోన్ల పరిధిలో తనిఖీలు, కూల్చివేత చర్యలు కొనసాగుతాయని సీఎంసీ అధికారులు తెలిపారు.




## అంబర్పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం నూతన కమిటీ ఏర్పాటు

అంబర్‌పేట, సెప్టెంబర్ 09;( వాయిస్ టూ డే): అంబర్ పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. బాగ్ అంబర్ పేట శివం రోడ్డులో గల సంఘం కార్యాలయంలో జరిగిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో మూడు సంవత్సరాల కోసం ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు, గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, సలహాదారులు డాక్టర్ మార్త రమేష్, డాక్టర్ పుట్ట పాండురంగయ్య, చిలువేరు యాదగిరి ల నేతృత్వంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా వర్కల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పగిడిమర్రి హరి, ప్రధాన కార్యదర్శిగా చిలక శివ్ కుమార్, కోశాధికారిగా భీమనపల్లి అశోక్, ఉపాధ్యక్షులుగా ఎలగందుల అంజయ్య, పెద్ద బొమ్మ మధుసూదన్, అంజాల విజయ్ కుమార్, ఏవి రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంజి వెంకటరమణ, గంధమల్లి శ్రీనివాస్, ఆవుల రాములు, జాయింట్ సెక్రెటరీలు గా గంగిశెట్టి మల్లేష్, తీగల నరేందర్, రాజేందర్ నాగుల, ప్రచార కార్యదర్శిగా వనం రమణ, కార్యవర్గ సభ్యులుగా ఇడెం యాదగిరి, సిలివేరు జయసింహ లను ఎన్నుకున్నారు. అలాగే నియోజకవర్గ మహిళా సంఘం అధ్యక్షురాలిగా భోగా నీరజను కూడా ఏకగ్రీవంగా నియమించారు. వీరితోపాటు గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా పెద్ద బొమ్మ దామోదర్, కాచిగూడ డివిజన్ అధ్యక్షుడిగా కోట వెంకటేష్, తిలక్ నగర్ అధ్యక్షునిగా సాయిని మూర్తి, పటేల్ నగర్ డివిజన్ అధ్యక్షునిగా గంగిశెట్టి సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా బండారు రాజు, బాగ్ అంబర్ పేట డివిజన్ అధ్యక్షునిగా మామిడాల రాజ్ కిరణ్, బర్కత్ పుర డివిజన్ అధ్యక్షుడిగా క్తైరం కొండ శ్రీకాంత్ లను అధ్యక్షుడు వర్గాల కృష్ణ నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ సంఘం పటిష్టత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. త్వరలోనే సంఘం సభ్యత్వాన్ని కూడా చేపడతామని వెల్లడించారు.



## కోలన్ హనుమంత్ రెడ్డి మాతృమూర్తి సులోచన మృతి

### నివాళులర్పించిన కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 9(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి మాతృమూర్తి శ్రీమతి సులోచన స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ బాచుపల్లి లోని వారి నివాసానికి చేరుకుని సులోచన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోలన్ హనుమంత్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. సులోచన మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.



## అనిల్‌కుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

నాచారం (వాయిస్ టుడే): రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్‌కు తెలంగాణ ప్రభుత్వ ఆర్టీఏ సభ్యుడు సురేష్‌లాల్ నేతికర్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనిల్‌కుమార్ యాదవ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## సైబరాబాద్ పోలీస్ సొసైటీ ఎన్నికల్లో కానిస్టేబుల్ నవీన్ ఘన విజయం

### ట్రెజరర్‌గా ఎన్నిక.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 9(వాయిస్ టుడే): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం నిర్వహించిన పోలీస్ సొసైటీ ఎన్నికల్లో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నవీన్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడంతో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు సైబరాబాద్ పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ నవీన్ మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ట్రెజరర్‌గా ఎన్నుకున్న ఉద్యోగుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు. ముఖ్యంగా పోలీస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సొసైటీ ఎన్నికల్లో తనతో పాటు విజయం సాధించిన ప్రతి ఒక్కరికీ నవీన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం అందరి సహకారంతో సమష్టిగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## అనాథ వృద్ధుడికి కుటుంబ సభ్యులుగా నిలిచిన MDR ఫౌండేషన్



పటాన్ చెరు (వాయిస్ టుడే): ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో రోడ్డుపై అనాథగా జీవిస్తున్న ఓ వృద్ధుడు నాలుగు రోజుల క్రితం మృతి చెందిన విషయం స్థానికుల ద్వారా పోలీసుల దృష్టికి వచ్చింది. పోలీసులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో పోలీసులు MDR ఫౌండేషన్‌ను సంప్రదించారు. అనాథలు, నిరాశ్రయులైన వారికి అండగా నిలుస్తూ, మానవతా దృక్పథంతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న MDR ఫౌండేషన్... ఈ వృద్ధుడిని కూడా తమ కుటుంబ సభ్యుడిగా భావించి ఈరోజు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించింది. మనిషి చివరి ప్రయాణంలో కూడా మానవత్వమే తోడుగా నిలవాలి అనే సంకల్పానికి MDR ఫౌండేషన్ మరోసారి నిదర్శనంగా నిలిచింది.



## సెప్టెంబర్ 22, 23 తేదీలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు (వాయిస్ టుడే): సెప్టెంబర్ 22, 23 తేదీలలో పటాన్చెరు కేంద్రంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో వేడుకల ఏర్పాట్లపై ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా.. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22న ప్రభుత్వ ఉపాధ్యాయులకు, 23న ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు.. పటాన్చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా.. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులందరూ హాజరై.. కార్యక్రమాన్ని దిగ్విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓ లు నాగేశ్వర రావు నాయక్, సుధాకర్, విజయ్ కుమార్, పౌలిన, భాస్కర్, రామచంద్రపురం జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ రాథోడ్, ప్రైవేట్ పాఠశాల ప్రతినిధులు తేజ, ప్రభాకర్ రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## పటాన్‌చెరులో ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

పటాన్ చెరు (వాయిస్ టుడే): పటాన్‌చెరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ (వీూణా) ఆవరణలో ప్రజాకవి, పద్మవిభూషణ్ శ్రీ కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పటాన్‌చెరు ఎంపీడీవో యాదగిరి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యాదగిరి మాట్లాడుతూ... తెలంగాణ భాషా సంస్కృతుల రక్షణ కోసం, ప్రజా హక్కుల కోసం కాళోజీ తన కలంతో నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. 1914 సెప్టెంబర్ 9 జన్మించిన కాళోజి నారాయణరావు (112వ జయంతి) "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అని చాటిచెప్పిన మహనీయుడని గుర్తుచేశారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాళోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ భాషా దినోత్సవం'గా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతీ ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.






# భారత్‌కు అసాధారణ మేధో సామర్థ్యం

### ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చిన సీనియర్ సైంటిస్ట్ ప్రొఫెసర్ యజ్ఞనారాయణ

పటాన్ చెరు (వాయిస్ టుడే): మనం వాడుతున్న మొబైల్ ఫోన్ల పరిజ్ఞానానికి నాంది పలికింది భారతీయ శాస్త్రవేత్తలేనని, మన దేశానికి అసాధారణమైన మేధో సామర్థ్యం ఉందని, దానిని విద్యార్థులు, యువ పరిశోధకులు ముందుకు తీసుకెళ్లాలని ఐఐటీ మద్రాసు పూర్వ ఆచార్యుడు, ట్రిబుల్ ఐటీ హైదరాబాదులో ఐఎన్ఎస్ఏ సీనియర్ సైంటిస్ట్ ప్రొఫెసర్ బి.యజ్ఞనారాయణ కోరారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'మాట్లాడటం వంటి సహజ సంకేతాలను ప్రాసెస్ చేయడంలో సవాళ్లు' అనే అంశంపై ఆయన విశిష్ట ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఈఈసీఈ విభాగం నిర్వహించింది. తన విశ్లేషణాత్మక ఉపన్యాసంలో, ప్రొఫెసర్ యజ్ఞనారాయణ సిగ్నల్ ప్రాసెసింగ్, స్పీచ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్, న్యూరల్ నెట్ వర్కులు, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్ (డీఎస్పీ)లలోని కీలక పరిణామాలు, సవాళ్ల గురించి చర్చించారు. మానవ జీవితంలో మాటల ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, మొబైల్ ఫోన్ల విస్తృత వినియోగం మాటల ద్వారా సంభాషించే సామర్థ్యంతో దగ్గరి సంబంధం కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు.

స్పీచ్ కంప్రెషర్, లీనియర్ ప్రిడిక్టివ్ కోడింగ్ (ఎల్పీసీ)లో బిష్ణు ఎస్. అటల్, స్పీచ్ రికగ్నిషన్ లో డి.రాజ్ రెడ్డి వంటి పరిశోధకుల మార్గదర్శక కృషిని గుర్తుచేసుకుంటూ, ఈ రంగంలో భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్తలు చేసిన గణనీయమైన కృషిని ప్రొఫెసర్ యజ్ఞనారాయణ నొక్కి చెప్పారు. దానిని కొనసాగించాలని ఆయన కోరారు.

కృత్రిమ మేధస్సు (ఏఐ), లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎంలు), జెనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను కూడా ఆయన పరిశీలించారు. వాటి సామర్థ్యాలు ప్రాథమికంగా డేటా ప్రాతినిధ్య నాణ్యతపై ఆధారపడి ఉంటాయన్నారు. ప్రస్తుత ఏఐ వ్యవస్థలతో ముడిపడి ఉన్న పరిమితులు, సవాళ్లను ఆయన హైలైట్ చేశారు. భవిష్యత్ పరిశోధనలకు ఆశాజనకమైన రంగాలుగా స్పీచ్, సహజ భాషా ప్రాసెసింగ్ ను అన్వేషించమని విద్యార్థులను ప్రోత్సహించారు.

స్పీచ్ ప్రాసెసింగ్, స్పీచ్ సిగ్నల్ ప్రాసెసింగ్ మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ, ప్రొఫెసర్ యజ్ఞనారాయణ మానవ స్పీచ్ ప్రాసెసింగ్ లో జ్ఞానం, సందర్భం, ఎంపిక చేసిన శ్రద్ధ ఉంటాయని, అయితే స్పీచ్ సిగ్నల్ ప్రాసెసింగ్ డీఎస్పీ టెక్నిక్ లను ఉపయోగించి మెషిన్ ఆధారిత విశ్లేషణ, ప్రాతినిధ్యంపై దృష్టి పెడుతుందని వివరించారు. సహజ సంకేతాలను అర్థం చేసుకోవడానికి వాటి డైనమిక్, పునరావృతం కాని, సంక్లిష్ట లక్షణాలపై లోతైన పరిశోధన అవసరమన్నారు.

తన ఉపన్యాసాన్ని ముగిస్తూ, ఏఐ నమూనాల సంక్లిష్టతను తగ్గించడానికి సహజ సంకేతాలను సూచించే మెరుగైన మార్గాలను అభివృద్ధి చేయాలని ప్రొఫెసర్ యజ్ఞనారాయణ పరిశోధకులకు పిలుపునిచ్చారు. సహజ సంకేతాలను ఎంత లోతుగా అన్వేషిస్తే, వాటి సంక్లి ష్టత గురించి అంతగా తెలుసుకోవచ్చని చెబుతూ, విద్యార్థులు జిజ్ఞాస, పట్టుదలతో పరిశోధనను చేపట్టాలని ఆయన ప్రోత్సహించారు.

తొలుత, కార్యక్రమ నిర్వాహకురాలు ప్రొఫెసర్ టి.మాధవి విశిష్ట అతిథిని పరిచేయం చేసి, స్వాగతించారు. ఈ సందర్భంగా కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంత ఆర్.ఎం. అతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎం.మరియదాసు దీనిని సమన్వయం చేశారు.

#### గీతంలో శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఫాసిజం వ్యతిరేక పోరాట యోధుడు, రాజకీయ కార్యకర్త శ్రీ కాళోజీ నారాయణ రావు 112వ జయంతిని హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 'ప్రజా కవి'గా సుపరిచితులైన కాళోజీ నారాయణరావు (9 సెప్టెంబర్ 1914 -- 13 నవంబర్ 2002) జయంతిని తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ భాషా దినోత్సవం'గా ప్రకటించింది. ఈ సందర్భంగా, గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు ఆయన విగ్రహానికి పూలు సమర్పించి ఘన నివాళులర్పించారు. ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఈ గొప్ప కవికి నివాళులర్పించారు.



## దేవేంద్రనాథ్‌కు ఎంపీ వద్దిరాజు ఘన నివాళి

### పొదిల రవికుమార్ తండ్రి దశదిన కర్మకు హాజరు

ఖానాపురం, సెప్టెంబర్ 9:లిలి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త పొదిల రవికుమార్ తండ్రి స్వర్గీయ దేవేంద్రనాథ్‌కు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఘన నివాళులర్పించారు. ఆగస్టు 29న దేవేంద్రనాథ్ మృతి చెందగా.. బుధవారం ముదిగొండ మండలం ఖానాపురంలోని ఆయన స్వగ్రామంలో దశదిన కర్మకాండ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ఆవుల రామారావు, జిల్లా గౌరవాధ్యక్షులు కొత్త సీతారాములు, అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవేంద్రనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం పొదిల రవికుమార్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఘనంగా మల్లారెడ్డి జన్మదిన వేడుకలు

### జీవిత చరిత్ర సిడి పాటలను తయారు చేసి బహుకరించిన ప్రదీప్ సింగ్




కంటోన్మెంట్, సెప్టెంబర్ 10 (వాయిస్ ప్రతినిధి): మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదిన వేడుకలు బోయిన్ పల్లి లోని అయన నివాసంలో ఘనంగా జరిగాయి. జన్మదిన వేడుకలలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నివాసానికి చేరుకొని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన డీజే వద్ద మల్లారెడ్డిని కార్యకర్తలు ఎత్తుకొని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం కార్యకర్తలు అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా అయన అభిమాని, వ్యాపారవేత్త ప్రదీప్ సింగ్ మల్లారెడ్డి జీవిత చరిత్ర, ఆయన సాధించిన గొప్ప విజయాలకు సంబంధించిన అంశాలను క్రోడీకరించి కళాకారుల తయారు చేయించిన పాటలతో కూడిన సిడిని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. తన పై ఉన్న ప్రేమాభిమానాలతో పాటలు రాయించి సీడీ తయారు చేసినందుకు ప్రదీప్ సింగ్ కు ధన్యవాదాలు తెలిపారు. తన చిన్ననాటి మిత్రుడైన అతని కొడుకు దుబాయిలో గొప్పగా అభివృద్ధిలోకి వచ్చి వివిధ కంపెనీలు,కార్యాలయాలు నెలకొల్పి ఉన్నత స్థితికి రావడం సంతోషకరమని అన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుపతిలో శ్రీవారిని దర్శించుకున్నానని ఆయన తన కోరికలను నెరవేర్చాడని , ప్రజా సేవ చేయడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

# కేసీఆర్ హయాంలో ఫార్మా రంగం గణనీయ అభివృద్ధి

### హైదరాబాద్ ఫార్మా హబ్‌గా ఎదిగింది.. 33 వేల ఎకరాలు సేకరించాం, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ అంటున్నారు

### 'కోల్డ్ చైన్ అన్‌బ్రోకెన్--2026' సదస్సులో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో హైదరాబాద్ దేశంలోని ప్రముఖ ఫార్మా కేంద్రాల్లో ఒకటిగా ఎదిగిందని పేర్కొన్నారు. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని నోవాటెల్ హోటల్‌లో 'కోల్డ్ చైన్ అన్‌బ్రోకెన్--2026' పేరుతో గ్లోబల్ కోల్డ్ చైన్ కనెక్షన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సును బుధవారం ఎంపీ ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు.

#### ఫార్మా రంగానికి హైదరాబాద్ కీలక కేంద్రం

కరోనా సమయంలో జినోమ్ వ్యాలీలోని భారత్ బయోటెక్ సంస్థ కోవాగ్జిన్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసి ఉత్పత్తి చేసిందని రవిచంద్ర గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లాను అభినందించారని తెలిపారు. హెటిరో, ఏఎంఎస్, డాక్టర్ రెడ్డీస్, దివీస్ వంటి ప్రముఖ ఫార్మా సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని చెప్పారు. ప్రపంచానికి అవసరమయ్యే ఔషధాల్లో సుమారు 35 శాతం ఇక్కడ తయారవుతున్నాయని, ఏటా సుమారు రూ.49 వేల కోట్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని




రవిచంద్ర పేర్కొన్నారు.

#### 33 వేల ఎకరాలతో విస్తరణకు ప్రణాళిక

ఫార్మా రంగాన్ని మరింత విస్తరించేందుకు గత ప్రభుత్వం 33 వేల ఎకరాల భూమిని సేకరించి సిద్ధం చేసిందని రవిచంద్ర తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని ఫ్యూచర్ సిటీగా ప్రభుత్వం ప్రచారం చేస్తోందని విమర్శించారు. తెలంగాణలో ఫార్మా, పరిశ్రమల రంగాలకు మరింత పెట్టుబడులు రావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

#### కోల్డ్ చైన్‌కు భారీ అవకాశాలు

కోల్డ్ స్టోరేజ్, కోల్డ్ చైన్ రంగం ఇటీవల వేగంగా అభివృద్ధి చెందుతోందని రవిచంద్ర తెలిపారు. రొయ్యలు, చేపలు, పూలు, పండ్లు, కూరగాయల నిల్వ, రవాణాకు ఆధునిక కోల్డ్ చైన్ మౌలిక వసతులు అవసరమని చెప్పారు. తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడంతో ఎగుమతులు, దిగుమతుల కోసం ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం, కాకినాడ, మహారాష్ట్రలోని ముంబయిపై ఆధారపడాల్సి వస్తోందన్నారు.

#### డ్రైపోర్టులతో అనుసంధానం

ఎగుమతులు, దిగుమతులకు మెరుగైన రవాణా సౌకర్యాల



కోసం కేసీఆర్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ హయాంలో ఆంధ్రప్రదేశ్‌కు సమీపంలోని కోదాడ, మహారాష్ట్రకు దగ్గరలోని జహీరాబాద్ ప్రాంతాల్లో డ్రైపోర్టుల ఏర్పాటుకు కృషి చేసినట్లు రవిచంద్ర తెలిపారు. హైదరాబాద్‌లో కోల్డ్ చైన్ రంగంపై అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

#### బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మరిన్ని పెట్టుబడులు

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని రవిచంద్ర ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమల స్థాపన, విస్తరణకు ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. సదస్సులో శంకర్, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళితబంధు లబ్ధిదారుల అకౌంట్‌లో కెళ్ళి డబ్బులు ఎక్కడికి పోలేదు : వొడితల ప్రణవ్

- కౌశిక్ రెడ్డి దుష్ప్రచారాన్ని దళిత సమాజం గమనిస్తుంది.
- అకౌంట్ లో కెళ్ళి ఒక్క రూపాయి కూడా పోలేదు.. నిరూపించకపోతే రాజీనామా చేసి,ముక్కు నేలకు రాసి,క్షమాపణ చెప్పాలి
- అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ కౌశిక్ రెడ్డి



జమ్మికుంట సెప్టెంబర్ 9 (వాయిస్ టుడే): దళిత బంధు నిధుల విషయంలో దళితులను మోసం చేసి వారికి నిధులు రాకుండా అడ్డుకున్న వ్యక్తి కౌశిక్ రెడ్డి అని,ఇప్పుడు మరల సోషల్ మీడియా వేదిక ద్వారా కొత్త డ్రామాకి తెరలేపుతూ దళిత బంధు లబ్ధిదారుల అకౌంట్ లో ఉన్న డబ్బులు 50 కోట్లు రూపాయలను వెనక్కి తీసుకున్నారన్న మాటల్లో నిజం లేదని,అబద్దాలు ఆడటంలో కౌశిక్ రెడ్డినీ మించిన వారు లేరని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50కోట్ల దళిత బంధు లబ్ధిదారుల అకౌంట్ లో ఉన్న నిధులు వెనక్కి తీసుకున్నామన్న వ్యాఖ్యల్లో నిజంలేదని, అది నిరూపించకపోతే ముక్కు నేలకు రాసి దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఎన్నికల్లో ఓట్ల కోసం దళితులను వాడుకున్నారనే తప్ప నిజంగా వారి సంక్షేమం కోసం ఆలోచించే వారైతే ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఎందుకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయలేదని ప్రశ్నించారు. మొదటి నుండి బీఆర్ఎస్ పార్టీ కౌశిక్ రెడ్డి దళిత సమాజానికి వ్యతిరేకమని అన్నారు.నిధులు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం,పార్టీదని త్వరలో నిధులు విడుదల చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు

### పూల మాల వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 9 (వాయిస్ టుడే): శ్రీ కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భం గా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొని కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, కాళోజీ తన రచనలు, కవిత్వం ద్వారా నాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారని అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై కాళోజీకి ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో సీపీఓ శ్రీనివాస చారి, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, డీవైఎస్ఓ రాందాస్, పరిశ్రమల శాఖ జీఎం హన్మంతు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా అల్ఫ్రెడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి, వైశాలి తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు వేధింపులకు గురైతే నిర్భయంగా పిర్యాదు చేయాలి

### సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 09 (వాయిస్ టుడే): జిల్లా లో విద్యార్థుల భద్రత ను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యం లో విద్యాసంస్థలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.ఆగస్ట్ నెలలో షీ టీం కి వచ్చిన పిర్యాదులలో 03 కేసులు నమోదు చేసి మహిళలను, విద్యార్థు లను వేధిస్తున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది.అవగాహన కార్యక్రమాల్లోభాగంగా విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్, పోక్సో చట్టం సోషల్ మీడియా వినియోగం/మోసాలు మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భం గా గంబిరావుపేట పోలీస్ స్టేషన్ పరిధి లోని గోరంటల , గజసింగవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకి అవగాహన కల్పించి , వేధింపులకు గురైతే వెంటనే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని , నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని షీ టీమ్అధికారులు సూచించారు.సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించ కూడదని , గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల,రవి , సిబ్బంది శ్రీలత, ప్రియాంక,శ్రీనివాస్‌తో పాటు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుదిరిన కాటన్ కార్మికుల, ఆసాముల కూలీ ఒప్పందం

- సమ్మెకు వెళ్లకముందే కూలీ పెంచిన యజమానులకు ధన్యవాదాలు
- పెరిగిన కూలి సెప్టెంబర్ 15 నుండి అమలు



సిరిసిల్ల, సెప్టెంబర్ 09 (వాయిస్ టుడే): కాటన్ వస్త్రానికి సంబంధించి పవర్లూమ్ కార్మికుల , ఆసాముల కూలి ఒప్పందం గడువు ముగిసినందున వెంటనే చర్చలు జరిపి కూలి పెంచాలని సీఐటీయూ - పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యం లో కాటన్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘానికి, చేనేత వస్త్ర వ్యాపార సంఘ ప్రతినిధులకు డిమాండ్ నోటీసు ఇచ్చిన దానిమీద సెప్టెంబర్ 8 మంగళవారం రోజున సాయంత్రం చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో కాటన్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షులు కట్టెకోల లక్ష్మీ నారాయణ, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్ ఆధ్వర్యం లో సీఐటీయూ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో కూలీ చర్చలు జరిగాయి. ఈ కూలి చర్చలలో కాటన్ వస్త్రానికి సంబంధించి పవర్లూమ్ కార్మికులకు 20 కౌంటు ప్యాక కు సంబంధించి గతం లో 10 పిక్కులకు 0 - 44 పైసలు ఉన్న కూలీని 0 - 6 పైసలు పెంచుతూ ప్రస్తుతం 10 పిక్కులకు 0 - 50 పైసలకు కూలి ఒప్పందం జరిగింది అదేవిధంగా పాప్లిన్ వస్త్రానికి సంబంధించి 10 పిక్కులకు 0 - 44 పైసలకు పెంచుతూ అదేవిధంగా ఆసాములకు సంబంధించి డబల్ కూలి చెల్లించే విధంగా ఇరు సంఘాల అంగీకారంతో చర్చలలో కూలి ఒప్పందం జరిగింది పెరిగినటువంటి కూలీ సెప్టెంబర్ 15 వ. తేదీ నుండి అమలు అవుతుందని ప్రకటించారు.ఈ సందర్భంగా సీఐటీయూ - పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ , జిల్లా అధ్యక్షులు కోడం రమణ లు మాట్లాడుతూ, కార్మికులు , ఆసాములు సమ్మెకు వెళ్లకముందే కూలి పెంచినటు వంటి యజమానులకు ధన్యవాదాలు తెలియజేశారు సెప్టెంబర్ 15 నుండి పెరిగిన కూలి ప్రకారం కార్మికులు , ఆసాములు కూలి తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాటన్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు , చేనేత వస్త్ర వ్యాపార సంఘం ప్రతినిధులు మరియు సీఐటీయూ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బాలుర పాఠశాలలో క్రీడా పోటీలు ప్రారంభం

### పోటీలు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

జమ్మికుంట సెప్టెంబర్ 9 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో (గా+ఖీ) మండల స్థాయి క్రీడా పోటీలను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా క్రీడలలో పాల్గొనబోతున్న విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థిని విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడల్లో ప్రావీణ్యం పొందినవారు సర్టిఫికెట్ పొందుతూ ఈ యొక్క సర్టిఫికెట్ ద్వారా కూడా ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు ఉంటాయి కనుక విద్యతోపాటు క్రీడా స్ఫూర్తి కూడా ఉండాలని ఈ యొక్క పాఠశాలలో చదువుకున్నటువంటి ఎందరో విద్యార్థులకు క్రీడల సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగం పొందారని అలాగే క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలుపుతూ మీరందరూ కూడా క్రీడల్లో మంచి ప్రావీణ్యం చూపించి మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హేమలత, ఎస్ఐ రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మరియు ఉపాధ్యాయులు. ప్రేమలత, జ.శ్రీలత, రేణుకా, ప్రవీణ్, శ్రీను, భగత్ మరియు తదితరులు పాల్గొన్నారు..

# విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్




సిరిసిల్ల, సెప్టెంబర్ 09 (వాయిస్ టుడే): విద్యా రంగ సమస్యలు పరిష్కరించడం లో రాష్ట్ర ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు శనిగారపు రజినీ కాంత్ విమర్శించారు.భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు రజినీకాంత్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాకముందు విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించిం దని అన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు రావాల్సిన స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయడంలో జాప్యం చేస్తోందని, దీంతో ప్రైవేట్ కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వక విద్యార్థులు పై చదువులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటాలను అణచివేయాలని చూడడం సరికాదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రిని నియమించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యులు కదారి శివ, ముబారక్, రషీద్, సృజన్, శ్రీతన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

తొర్రూరు, సెప్టెంబర్ 9 వాయిస్ టుడే : విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య కోరారు. డివిజన్ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం కంప్యూటర్ ల్యాబ్ ను ఎంఈఓ , కాంప్లెక్స్ హెచ్ఎం జెల్లా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. నేటి తరంలో డిజిటల్ నైపుణ్యం కీలకమని పేర్కొన్నారు. టెక్నాలజీ నేర్చుకున్న విద్యార్థులు భవిష్యత్‌లో ఏ రంగంలోనైనా రాణిస్తారని అన్నారు. గ్రామీణ విద్యార్థులు ప్రపంచస్థాయి అవకాశాలను అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శారదా దేవి, ఉపాధ్యాయులు విమలాదేవి, ఎస్కే దర్గా హుస్సేన్, రేణుక, రోజా, మౌనిక, మమతా, పల్లవి, సమ్మక్క, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.





## ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

### తెలుగు భాషా వైభవాన్ని చాటిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

### కాళోజీ వేషధారణ ప్రత్యేక ఆకర్షణ

### “ఈ రోజు తెలుగులోనే మాట్లాడుదాం” కార్యక్రమం

హనుమకొండ, సెప్టెంబరు 09 (వాయిస్ టుడే): తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ ప్రజల భాష, యాస, సంస్కృతి, సాహిత్యానికి విశిష్ట గుర్తింపు తెచ్చిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తెలుగు పాటలు, నృత్యాలు, పద్యాలు ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. కాళోజీ నారాయణరావు వేషధారణలో విద్యార్థి చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాళోజీ సాహిత్యం, తెలంగాణ భాషా వైభవాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరితా రెడ్డి మాట్లాడుతూ మాతృభాష మన వ్యక్తిత్వానికి, సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతిబింబమని అన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి, మాతృభాషను ప్రేమించి, గౌరవించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో “ఈ రోజు తెలుగులోనే మాట్లాడుదాం” అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రోజంతా సాధ్యమైనంత వరకు తెలుగులోనే సంభాషిస్తూ మాతృభాషపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు ఉపాధ్యాయులు చంద్రమౌళి, మంజుల, పూర్ణిమ, రేణుక సమన్వయంతో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## దంతాలపల్లి జడ్.పి.హెచ్.ఎస్‌లో ఎలక్షన్స్

### హెడ్ గర్ల్‌గా అల్లం మహతి..
### హెడ్ బాయ్‌గా మంగళపల్లి కుమారస్వామి విజయం

దంతాలపల్లి, సెప్టెంబర్9(వాయిస్‌టుడే): దంతాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎలక్షన్స్--2026లో భాగంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలను ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతిలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఏ. శ్రీదేవి, ఎం. విజయ్ కుమార్, జి. సంతోష్ కుమార్, ఎం. యాకన్న లు నిర్మావహించగా మండల విద్యాశాఖ అధికారి ఎం. శ్రీదేవి, దంతాలపల్లి గ్రామ సర్పంచ్ పొన్నొటి బాలాజీ, ఉప సర్పంచ్ వెంకన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వేణుమాధవ్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయురాలు ఏ. శ్రీదేవి, స్టాఫ్ సెక్రటరీ సురేందర్ గుప్త పరిశీలించారు.హెడ్ గర్ల్ పదవికి అల్లం మహతి, కుంభం పూజ, పేర్ల పల్లవి లు పోటీపడగా అల్లం మహతి హెడ్ గర్ల్ గా గెలుపొందగా హెడ్ బాయ్ పదవికి జాటోత్ గణేష్, పంతం పార్థు, మంగళపల్లి కుమారస్వామి పోటీ లో మంగలపల్లి.కుమారస్వామి గెలుపొందాడు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి వేణు మాధవ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, బాధ్యతాయుతమైన పౌరసత్వం పెంపొందించేందుకు పాఠశాల ఎన్నికలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులకు ప్రజాస్వామ్య ఎన్నికల విధానంపై ప్రత్యక్ష అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని,కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారన్నారు.

# విద్యార్థులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

**- బల్దియా చైర్ పర్సన్ సుహాసిని**



హుజూరాబాద్ సెప్టెంబర్ 9 (వాయిస్ టుడే): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని , వాటిని విద్యార్థులు సమానంగా తీసుకోవాలని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రోశీటాల సుహాసిని అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్జిఎఫ్ మండలస్థాయి అండర్ 14 , అండర్ 17 బాల బాలికల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....క్రీడలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంచుతాయని, కెరటాలను స్ఫూర్తిగా తీసుకొని పడిపోయినప్పటికీ లేచే ప్రయత్నం చేయాలని కోరారు. గెలుపు ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తిని చాటాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని క్రీడల్లో రాణించి ప్రభుత్వము అందించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హుజురాబాద్ మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ... విద్యార్థులందరూ మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడలను విజయవంతం చేయాలని సూచించారు. ఎంతోమంది క్రీడాకారులు గ్రామీణ క్రీడలనుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇల్లందుల సమ్మయ్య, కోయల్ కార్ భారతి, చందమల్ల పుణ్య, మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి చిరుత శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, బి.తిరుమల, మ్యాకల తిరుపతి, సొల్లు బాబు, టిజీ పేట గౌరవ అధ్యక్షులు సొల్లు సారయ్య, రిటైర్డ్ పిడి వెంకట్ రెడ్డి, కే రాజిరెడ్డి, హాకీ ఆసోసియేషన్ కార్యదర్శి బోడిగ తిరుపతి, పీడీ, పీఈటీలు కే రేణుక, దూడ సత్యనందం, పి రాజు, భాగ్యలక్ష్మి, కవిత, ఎస్ అనిల్, సాయి, వెంకటేష్ పాల్గొన్నారు.





# శాతవాహన విశ్వవిద్యాలయంలో జిమ్ ప్రారంభం

కరీంనగర్,సెప్టెంబర్ 09(వాయిస్ టుడే): శాతవాహన విశ్వవిద్యాలయంలో కొత్తగా నిర్మించిన యూనివర్సిటీ జిమ్నాసియం"ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం,వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యు ఉమేష్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ యు.ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి సంపూర్ణ వికాసానికి శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు పునాది అని, ఆరోగ్యకరమైన శరీరంలోనే మంచి ఆలోచనలు,ఆకాంక్షలు రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు.అన్ని రంగాలలోనూ అద్భుతమైన సౌకర్యాలను అందించడానికి విశ్వవిద్యాలయం నిరంతరం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు మరియు విద్యార్థులు తమ శారీరక దృఢత్వాన్ని మెరుగుపరచుకోవడానికి కొత్త వ్యాయామశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.విద్యార్థులలో ఆరోగ్యం,ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. ఇటువంటి సౌకర్యాలు విశ్వవిద్యాలయంలోని క్రీడాకారులకు ఎంతగానో సహాయపడతాయి అని పోలీస్ కమిషనర్ అన్నారు.ఫిట్‌నెస్ కోసం వ్యాయామశాలను ఉపయోగించుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సతీష్ కుమార్,వీసీ ఓఎస్‌డి హరికంత,పరీక్షల కంట్రోలర్ సురేష్ కుమార్,అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేపల్లి సుజాత,సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామకాంత్,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి,ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం,అధ్యాపక సభ్యులు సరసిజ, హుమేరా తస్లీం,మునవర్,అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిషోర్,విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది,పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 13వ రాష్ట్ర సబ్ జూనియర్ మరియు జూనియర్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు

కరీంనగర్, సెప్టెంబర్ 09(వాయిస్ టుడే): తెలంగాణ యోగా సంఘం ఆదేశాల మేరకు యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా/స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ/తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13 వ రాష్ట్ర సబ్ జూనియర్ మరియు జూనియర్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 11 మరియు 12 తేదీల్లో కరీంనగర్ లో నిర్వహిస్తున్నామని జిల్లా యోగ చైర్మన్ రవీందర్ సింగ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా పోటీలకు అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాల కొత్తపల్లి ఆతిథ్యం ఇస్తుందని,పాఠశాల చైర్మన్ ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ పోటీల్లో దాదాపు 900 మంది బాల బాలికలు పాల్గొంటున్నారని, గెలుపొందిన వారిని జాతీయ స్థాయిలో ఎంపిక చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,యోగ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు,జిల్లా స్పోర్ట్స్ అధికారులు హాజరవుతారని తెలిపారు.

# శాతవాహన యూనివర్సిటీలో ఔట్ సోర్సింగ్ పోస్టులపై విచారణ జరిపించాలి

**రిటైర్డ్ అయ్యిన వారిని విధుల్లో కొనసాగించే పద్ధతిని విరమించుకోవాలి**

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్**




కరీంనగర్, సెప్టెంబర్ 09(వాయిస్ టుడే): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ పోస్టులపై విచారణ జరిపించాలి అని వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ యూనివర్సిటీలో జరుగుతున్న అవక తవకలపై సమగ్ర విచారణ జరిపించాలి మరియు ఔట్సోర్సింగ్ నియామకాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.36 మంది పైగా వ్యక్తులకు పోస్టింగ్ ఇవ్వడం జరిగిందనీ,దానికి ఎలాంటి ఆర్డర్ ఇవ్వకుండా పోస్టింగ్ ఇవ్వడం మరియు దీనిపైన నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దేనికి సంకేతం అని వారు వైస్ చాన్సలర్ ను ప్రశ్నించారు.నియమాకాలలో పూర్తిస్థాయిలో దోపిడీ జరిగిందని స్పష్టంగా కనబడుతుంది అర్హత లేని వారికి అవకాశాలు ఇవ్వడం పూర్తిగా రాజకీయ ప్రలోభాలకి గురైనట్టు స్పష్టంగా కనిపిస్తుందని వారు అన్నారు.పోస్టులను అమ్ముకోవడానికి ప్రోత్సహిస్తున్న వారు ఎవరు దానికి ముఖ్య కారకులు ఎవరు? పోస్టులు అంగట్లో సరుకుల మాదిరిగా అమ్ముకుంటూ నియామకాలను చేపడితే అది ఏవిధంగా సమంజసం దీనిపైన ఉన్నతాధికారులు స్పందించి విచారణ వేగవంతం చేసి అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయమయ్యే విధంగా అధికార యంత్రాంగం ప్రభుత్వం పాటుపడాలని కోరారు. శాతవాహన విశ్వవిద్యాలయం అంటేనే అవినీతికి అడ్డాగా మారిపోయింది దీనిపైన రకరకాల సమస్యలు ఉన్నాయి పూర్తి స్థాయిలో వాటిని పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతావని వారు హెచ్చరించారు.అదేవిధంగా రిటైర్డ్ అయిన వారిని విధులలో కొనసాగించడం దేనికి సంకేతం రిటైర్డ్ అయిన వారిని వీధుల్లో నుండి తొలగించాలి కొత్త రిక్రూట్మెంట్ ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ నియామకాలని చేపట్టాలి పూర్తిస్థాయిలో యూనివర్సిటీ అభివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు.వైస్ చాన్సలర్ నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే ఉన్నత విద్యా మండలి చైర్మన్ ను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలియచేశారు.ఔట్సోర్సింగ్ నియామకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి దానికి పాల్పడిన వారు ఎవరైనా సరే వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు యూనివర్సిటీనీ అభివృద్ధి చేసుకొని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని వారు తెలియజేశారుఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్,నవీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినయ్ బోగేష్,అభిషేక్ పాల్గొన్నారు



# ఆపదలో పెన్నిధి ముఖ్యమంత్రి సహాయ నిధి

**సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

కరీంనగర్, సెప్టెంబర్ 09(వాయిస్ టుడే): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన ఎన్నో కుటుంబాలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.ముకరంపురలోని తన కార్యాలయంలో 26 మందికి 12 లక్షల రూపాయల మొత్తం విలువ గల చెక్కులను నరేందర్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 నెలల క్రితం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా అనేక మంది వివిధ సమస్యలు పరిష్కరిస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటికీ దాదాపు వెయ్యి మందికి పైగా చెక్కులు అందజేశామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముప్పిడి స్వప్న,గట్టు కమల, ఎండి కలీమొద్దీన్,పెనుకుల సాయి కిరణ్,తాటికొండ రాజిరెడ్డి, చిప్ప శంకరమ్మ,షమీద్ బేగం, షేక్ షకీల్ అహ్మద్,పెరుక రాజేందర్, బి.కుమారస్వామి,చిప్ప రవీందర్ చెక్కులు పొందారు.




# కేంద్ర కనీస వేతన సలహా బోర్డులో సీఐటీయూకు ప్రాతినిధ్యం కల్పించాలి

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్**

కరీంనగర్, సెప్టెంబర్ 09(వాయిస్ టుడే): కేంద్రం కనీస వేతన సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణలో ప్రధాన కేంద్ర కార్మిక సంఘం సీఐటీయూకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక,కార్పొరేట్ అనుకూల విధానాలకు మరో నిదర్శనమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్ విమర్శించారు.కనీస వేతన సలహామండలి బోర్డు నుంచి సీఐటీయూను మినహాయించిన కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా ప్లకార్డ్స్ తో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఎడ్ల రమేష్ మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాలు,జీవన ప్రమాణాలు,ఉపాధి పరిస్థితులకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశంపై నిర్ణయాలు తీసుకునే కనీస వేతన సలహా బోర్డులో సీఐటీయూ,ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ వంటి ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం అప్రజాస్వామికమన్నారు.కేంద్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించిన కేంద్ర కనీస వేతన సలహా బోర్డు వాస్తవానికి కార్మికుల ప్రయోజనాలను కాపాడాల్సిన త్రైపాక్షిక వేదికగా ఉండాలన్నారు.అయితే ప్రధాన కార్మిక సంఘాలను పక్కన పెట్టి,వారికి అనుకూలమైన వారితో బోర్డును ఏర్పాటు చేయడం ద్వారా కార్మికుల వేతనాలను అణచి వేయడానికి,యజమానులకు అనుకూలమైన విధానాలను చట్టబద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.లేబర్ కోడ్ల పేరుతో కార్మికుల హక్కులను హరించిన కేంద్ర ప్రభుత్వం,ఇప్పుడు కనీస వేతనాల నిర్ణయ ప్రక్రియలో కూడా కార్మిక సంఘాల గొంతును నొక్కివేయడానికి ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు జనగాం రాజమల్లు,నగర కన్వీనర్ పుల్లెల మల్లయ్య,మెడికల్ రిప్ సేల్స్ రిప్రెజెంట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చికోటి శ్రీధర్,జిల్లా కమిటీ సభ్యులు చెలికాని శ్రీనివాస్,పిల్లి రవి యాదవ్,నాయకులు మిరిపాల అంజయ్య, తిరుమలయ్య,ప్రభాకర్ రెడ్డి,కాల్వ సంపత్, పాతూరి లింగారెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా అస్మిత ఖేలో ఇండియా సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్

**క్రీడలతో యువతలో ఆత్మవిశ్వాసం,క్రమశిక్షణ పెంపొందుతుంది**

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్, సెప్టెంబర్ 09(వాయిస్ టుడే): యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు,ముఖ్యంగా బాలికలను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా సిటీ లెవల్ రగ్బీ టోర్నమెంట్ నుకరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించిన మేయర్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం, పట్టుదలతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు.చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు యువత,విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఖేలో ఇండియా--అస్మిత వంటి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని మేయర్ తెలిపారు. మట్టిలోని మాణిక్యాలను గుర్తించి వారికి జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అన్నారు.కరీంనగర్ జిల్లాలో రగ్బీ క్రీడ అభివృద్ధికి రగ్బీ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా చేస్తున్న కృషిని మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీ శివకృష్ణ, పెద్దపల్లి జిల్లా సెక్రటరీ రామకృష్ణ,సిద్దిపేట జిల్లా సెక్రటరీ అజయ్,రాజన్న సిరిసిల్ల జిల్లా సెక్రటరీ హనుమంతు,జగిత్యాల జిల్లా సెక్రటరీ మహిపాల్,వెంకటేశ్వర హాస్పిటల్ అడ్మిన్ వెంకటేశ్వర్లు,రగ్బీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేషబాబు పాల్గొన్నారు.

# తెలంగాణ భాషా యాసకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ప్రజాకవి కాళోజీ

**మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్‌లో కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు**



కరీంనగర్, సెప్టెంబర్ 09(వాయిస్ టుడే): నగరంలోని రేకుర్తి 19వ డివిజన్‌లో ప్రజాకవి,స్వాతంత్ర్య సమరయోధుడు,పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు గారి విగ్రహానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల జీవితాలను,వారి భావోద్వేగాలను,భాషా యాసను తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన మహోన్నత ప్రజాకవి అని కొనియాడారు.తెలంగాణ భాషలోని మాధుర్యాన్ని,తెలంగాణ యాసలోని ప్రత్యేకతను తన సాహిత్యంతో ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి కాళోజీ అని అన్నారు.సమాజంలో జరుగుతున్న అన్యాయాలు,అసమానతలు,ప్రజా సమస్యలపై తన కలం ద్వారా నిరంతరం పోరాడిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.కాళోజీ ఆలోచనలు, రచనలు,ప్రజాస్వామ్య విలువలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. కాళోజీ నారాయణరావు వంటి మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేయర్ అన్నారు.ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ గౌడ్,కాళోజీ నగర్ కాలనీల అధ్యక్షులు రమణారెడ్డి, నారాయణరెడ్డి,డివిజన్ నాయకులు, యువకులు,పాల్గొన్నారు.

# న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ

భద్రాచలం, సెప్టెంబర్ 09 : న్యాయవాదుల సంక్షేమం, ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు హెల్త్ కార్డులు పంపిణీ చేసారు. బుధవారం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై న్యాయవాదులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్ మాట్లాడుతూ, న్యాయవాదుల ఆరోగ్య పరిరక్షణలో హెల్త్ కార్డులు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం కోసం బార్ అసోసియేషన్ తరఫున చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా హెల్త్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పూసాల శ్రీనివాసాచారి మాట్లాడుతూ న్యాయవాదుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి బార్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. హెల్త్ కార్డుల వల్ల సభ్యులకు అందే ప్రయోజనాలను వివరించారు. న్యాయవాదుల అవసరాలను



దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో కూడా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తామని అన్నారు. అంతేకాకుండా 2019 తరువాత న్యాయవాదులుగా ఎన్రోల్ అయిన వారికి ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పాపినేని కృష్ణకుమార్, ఎం.వి. రమణరావు, మాజీ అధ్యక్షులు కోట దేవదానం, రావి రామ్ మోహనరావు, అవులూరి సత్యనారాయణ పాల్గొన్నారు. న్యాయవాదుల ఆరోగ్య భద్రతకు ఉపయోగపడే హెల్త్ కార్డులను అందించడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేసారు.



## కాంగ్రెస్-బీఆర్ఎస్ కుమ్మక్కుతో అసెంబ్లీ సమావేశాలను తప్పుదోవ పట్టిస్తున్నారు

**బీజేపీ సీనియర్ నాయకులు రావుల రామనాథ్**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) సెప్టెంబర్ 09: తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రామనాథ్ తీవ్రంగా విమర్శించారు. ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం ప్రశ్నించకుండా, సమాధానం చెప్పాల్సిన అధికార పక్షం సమాధానం ఇవ్వకుండా అసెంబ్లీ సమావేశాలను వాయిదాలతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. 22–ూ నిషేధిత భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం, ఉద్యోగ సమస్యలు, రైతులు, విద్యార్థులు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక కీలక సమస్యలపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు. బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చెప్పినట్లు గా అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు పొడిగించి ప్రజా సమస్యలకు ప్రభుత్వం స్పష్టమైన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలకు ఉచిత విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకపోతే బీజేపీ ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రావుల రామనాథ్ బీజేవైఎం నిర్మల్ జిల్లా అధ్యక్షులు దొడ్డికింది నిరంజన్ రెడ్డి, ఇర్ల విజయ్, దీక్షిత్ రెడ్డి, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్లు, ఆయాల అక్రమ అరెస్టులను ఖండించిన సిఐటియు

**ఉద్యోగ భద్రత కల్పించాలి వేతనాన్ని 18,000కు పెంచాలి అంగన్వాడీ కేంద్రాల్లో శ్రీ ఆధారిత ప్రీ-ప్రైమరీ విద్యా విధానాన్ని అమలు చేయాలి**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)సెప్టెంబర్ 09: నిర్మల్ జిల్లా:అంగన్వాడీ టీచర్లు, ఆయాల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి తరలివెళ్తున్న నిర్మల్ జిల్లా అంగన్వాడీ టీచర్లు, ఆయాలను పోలీసులు ముందస్తుగా అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ నిర్మల్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అరెస్టు చేసిన అంగన్వాడీ టీచర్లను సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా బొమ్మెన సురేష్ మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేయడం వారి హక్కు అని, అలాంటి కార్యక్రమాలకు వెళ్లకుండా ముందస్తుగా అరెస్టులు చేయడం దుర్మార్గమని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అంగన్వాడీ టీచర్లు సహాయకులు తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లో అసెంబ్లీ వద్దకు తరలివచ్చారని, అదే సమయంలో నిర్మల్ జిల్లాలో అంగన్వాడీ టీచర్లు ఆయాలతో పాటు వందలాది మందిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. అంగన్వాడీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలకు కనీసం ?18,000 గౌరవ వేతనం చెల్లించాలని, అంగన్వాడీ కేంద్రాల్లో ఆధారిత ప్రీ-ప్రైమరీ విద్యా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. శైలజ, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ నిర్మల్ పట్టణ అధ్యక్షురాలు సాధ, కార్యదర్శి కవిత, రమా చంద్రకళ, కృష్ణవేణి లావణ్య, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ రాంబాబు



ముదిగొండ మండలం సెప్టెంబర్ 9 వాయిస్ టుడే : చిరుమర్రి గ్రామంలో సామినేని చలపతిరావు ఇంటి నుండి పంచాయతీ రోడ్డు వరకు మరియు స్వామిని నాగేష్ ఇంటి నుండి ఉపేందర్ ఇంటి వరకు మొత్తం అందాజా ఆరు లక్షల రూపాయలు గ్రామపంచాయతీ నిధుల నుండి సీసీ రోడ్డుని పోయాలని గ్రామపంచాయతీ తీర్మానం ప్రకారం బుధవారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సామినేని రాంబాబు, ఉప సర్పంచ్ మోర రామకృష్ణ, పాలకవర్గ సభ్యులు సామినేని చలమయ్య, కోలేటి ఉపేంద్రరావు, శాఖ కార్యదర్శులు సామినేని రామయ్య, గండు ఉపేందర్, గ్రామ పెద్దలు బండి శేఖర్, సామినేని మంగయ్య, నాగయ్య, సత్యం, మాజీ సర్పంచ్ ఇనప బాబు, టిఆర్ఎస్ నాయకులు సామినేని నాగేష్, పెద్దలు ఉన్నాం కోటేశ్వరరావు, మల్లెల నాగేశ్వరరావు, పల్లపాటి లాలయ్య, చావగాని మాధవరావు, సామినేని బాబు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## చైన్ దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్

**1.5 తులాల బంగారు చైన్, బైక్ స్వాధీనం**

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ కె. పురుషోత్తం రెడ్డి**

రాయికల్ (వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలో వృద్ధురాలి మెడలోని బంగారు చైన్ దొంగతనం చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఒకటిన్నర తులాల బంగారు చైన్‌తో పాటు బైక్‌ను స్వాధీనం రికవరీ చేసినట్లుజగిత్యాల డీఎస్పీ కె. పురుషోత్తం రెడ్డి తెలిపారు. బుధవారం రాయికల్ పోలీసు స్టేషన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని ఇటిక్యాల్ ఎక్స్‌రోడ్ కు చెందిన 71 ఏళ్ల వృద్ధ మహిళ 4వ తేదీ రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ముగ్గురు వ్యక్తులు ఆమె ఇంటి తలుపును నెట్టుకుని లోపలికి అక్రమంగా ప్రవేశించి, మెడలో ఉన్న ఒకటిన్నర తులాల బంగారు చైన్‌ను దొంగిలించి పరారయ్యారనీ బాధితురాలి ఫిర్యాదు మేరకు రాయికల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టి సెప్టెంబర్ 9న కుమ్మరిపల్లి బస్టాండ్ వద్ద రాయికల్ వైపు వస్తున్న నరేష్ నవనిత్ మనోజ్ అను ముగ్గురు వ్యక్తులను అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ఎస్ఐ సుదీర్ రావు, సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకుని విచారించగా వారు చైన్ దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారని తెలిపారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఇళ్లలోని విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని రాయికల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

**పోలీసులకు డీఎస్పీ అభినందనలు**

చైన్ దొంగతనం కేసును ఛేదించడంలో కృషి చేసిన రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐ సుదీర్ రావు, పోలీసు సిబ్బంది, సర్కిల్ క్రైమ్ పార్టీ సభ్యులు శ్రీనివాస్, విజయ్, తిరుమల్‌లను జగిత్యాల డీఎస్పీ కె. పురుషోత్తం రెడ్డి అభినందించి బహుమతి అందజేశారు.

## నిర్మల్ నియోజకవర్గానికి సరస్వతి కాలువ నీరు విడుదల చేయాలని కూచాడి శ్రీహరి రావు విజ్ఞప్తి

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) సెప్టెంబర్ 09: నిర్మల్ నియోజకవర్గ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్సారెస్పీ సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు కోరారు. ఈ విషయాన్ని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో ఫోన్‌లో మాట్లాడి నిర్మల్ నియోజకవర్గానికి సరస్వతి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించి, సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించి నీటి విడుదలకు చర్యలు చేపట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి కూచాడి శ్రీహరి రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూచాడి శ్రీహరి రావు తో పాటు లక్ష్మణ్‌చందా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ్రో నరేశ్ రెడ్డి మామడ మాజీ జెడ్పిటిసి మొహమ్మద్ రఫీ మామడ మాజీ సర్పంచ్ బాపయ్య మరియు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## అరెస్టులతో ప్రజా సమస్యలు తీర్చలేరు

**జనసేన పార్టీ నాయకుడు కాస రాజు పటేల్**



కరీంనగర్,సెప్టెంబర్ 09(వాయిస్ టుడే): రాష్ట్రంలో ప్రజల సమస్యలపై గళమెత్తుతున్న నాయకులపై అక్రమ కేసులు పెడుతూ అరెస్టులు చేస్తే ప్రజా సమస్యలు తీర్చలేరని జనసేన పార్టీ నాయకుడు కాస రాజు పటేల్ అన్నారు.జనసేన తెలంగాణ అధ్యక్షులు శంకర్ గౌడ్ అరెస్టుకు నిరసనగా కోర్టు చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద జనసేన పార్టీ కరీంనగర్ జిల్లా నాయకులు కాస రాజు పటేల్ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాస రాజు పటేల్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎవరు గలమెత్తిన వారిని భయపెట్టి అరెస్టుల పర్వంకి దిగిన రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించే రోజు అతి కొద్ది రోజుల్లో ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వారికి గుర్తు చేస్తేనే అరెస్టుల పర్వం కొనసాగిస్తున్నారని, 22 ఏ భూములపై గాని,ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలపై గాని పరిష్కారాలు చూపకుండా అరెస్టు చేస్తూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని చేతగాని ప్రభుత్వం ప్రశ్నించే గొంతును అనగదొక్కాలని చూస్తున్నారు ఇలా ఇలాంటి అరెస్టుల పర్వం గానీ ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ఇలానే కొనసాగితే జనసేన పార్టీ ఉవ్వెత్తున ఉద్యమం చేయబోతుంది అని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ పొన్నాల తిరుపతి, వీర్ల శ్రీనివాస్ రావు,అంబాలా సృజన్ కుమార్,జనసేన నాయకులు అన్వేష్ రెడ్డి వీర మహిళలు రాగుల శిరీష,గాలిపెల్లి కుమార్,కుంట సుజాత,గుండా శకుంతల పాల్గొన్నారు

## కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఘన నివాళులు సమర్పించిన

**జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) సెప్టెంబర్ 09: తెలంగాణ ప్రజాకవి స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా ఉద్యమాల గొంతుక కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల సమస్యలను తన రచనలు, కవిత్వం ద్వారా సమాజానికి తెలియజేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో సామాజిక విలువలను పెంపొందించడంలో ఆయన సాహిత్యం ఎంతో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

కాళోజీ గారి నా గొడవ వంటి రచనలు ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసి, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని కల్పించాయని అన్నారు. ఆయన ఆశయాలు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత వంటి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఎస్పీ సూచించారు. కాళోజీ నారాయణరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ యూనస్ అలీ, ఎస్బి సీఐ మల్లేష్, ఆర్ ఐ లు రామ్ నిరంజన్, శేఖర్, శ్రీపాల్ ఆర్ ఎస్ ఐ లు మరియు డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు



## వరద కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

**- మాడ్గులపల్లి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా**

**- మండల కేంద్రములో రైతుల రాస్తారోకో**

మాడ్గులపల్లి సెప్టెంబర్ 9 (వాయిస్ టుడే): వరద కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేసిన అనంతరం మండల కేంద్రములో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద కాల్వ ద్వారా ప్రభుత్వం కేవలం 200 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేయడం వల్ల చివరి ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదన్నారు.కాలువ సామర్థ్యం ప్రకారం 600 క్యూసెక్కుల నీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆయకట్టు కింద ఉన్న చెరువులను కుంటలను తక్షణమే నింపాలని కోరారు.అక్రమ తూములను అరికట్టాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పెద్దదేవులపల్లి రిజర్వాయర్ పైన లిఫ్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ అధికారులు ఈ విషయంపైన నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వెంటనే స్పందించి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చేసి రైతాంగాన్ని ఆదుకునేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని లేని యెడల సంబంధిత అధికారుల కార్యాలయలు ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దేవిరెడ్డి అశోక్ రెడ్డి,యువజన సంఘం నాయకులు పుల్లెంల శ్రీకర్,పఠాని శ్రీను,ఎలిజాల రమేష్, గవ్వ రవి,రైతు సంఘం నాయకులు దేవి రెడ్డి మల్లా రెడ్డి,నారాయణ రెడ్డి శంకర్,కట్ట వెంకట్ రెడ్డి,పిల్లుట్ల బక్కయ్య,సందీప్,రవి,సంపత్,నరేష్,కొండ నాగరాజు,సంజీవ రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు — VOICE OF PRAJALU — ప్రజల గొంతుక - నిజం కోసం.. — తెలుగు దినపత్రిక
హైదరాబాద్
గురువారం 10 సెప్టెంబరు 2026



## అగ్రవర్ణాల మోసానికి చరమగీతం బీసీల రాజ్యాధికారం కోసం మల్లన్న పాదయాత్ర

**- బీసీలు ఏకమవ్వాలి బహుజన రాజ్యం సాధించాలి**

**- బహుజన రాజ్యాధికారమే ధ్యేయం**
**సెప్టెంబర్ 17 నుంచి మల్లన్న పోరుబాట**

**అగ్రవర్ణ పార్టీలు బీసీలను మోసం చేశాయి**
**టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు సాయిని పాపన్న**

రాయికల్( వాయిస్ టుడే): బీసీలకు రాజకీయంగా రాజ్యాధికారం సాధించడమే తీన్మార్ మల్లన్న చేపట్టనున్న పాదయాత్ర ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) జిల్లా అధ్యక్షుడు సాయిని పాపన్న అన్నారు. రాయికల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీన్మార్ మల్లన్నపై అనేక కుట్రలు చేసిందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మల్లన్న శాసన మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదని విమర్శించారు.ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, బీసీలు మరియు బహుజనులకు రాజకీయ రాజ్యాధికారం సాధించే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీ నుంచి తీన్మార్ మల్లన్న పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

అగ్రవర్ణ పార్టీలను నమ్మి బీసీలు ఇప్పటివరకు మోసపోయారని ఆరోపించిన ఆయన, బీసీలు, బహుజనులు ఐక్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీలో సభ్యత్వం తీసుకుని రాజ్యాధికార సాధన కోసం ఒకే తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.బహుజన రాజ్యాధికారం కోసం జరుగుతున్న తీన్మార్ మల్లన్న పాదయాత్రను ప్రజలందరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అరె శేఖర్ ,జగిత్యాల రురల్ ఉపాధ్యక్షులు దశరథం అగునూరి గంగరాజం పాల్గొన్నారు.



## అర్హులైన్ జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

**గృహనిర్మాణ పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయాలి**

హుజూర్‌నగర్: సెప్టెంబర్ 09 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి రామస్వామి గుట్టవద్ద గత ప్రభుత్వ హాయంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలకు పొజిషన్ ఇచ్చి గృహనిర్మాణ పథకం ద్వారా రూ 5 లక్షల నిధుల కేటాయింపు చేయాలని కోరుతూ తహసిల్దార్ బండా కవిత మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ కమిషనర్ కే సతీష్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎటువంటి జీత భత్యాలు లేకుండా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై రాష్ట్ర నీటి పారుదల ఫౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలుస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.



## మహిళా శక్తి భవనానికి భూమి పూజ

జహిరాబాద్ వాయిస్ టుడే , సెప్టెంబర్ 9: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం కొల్లూర్ గ్రామంలో మహిళా శక్తి భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చింతల్‌గట్టు శివరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మహిళల సంక్షేమం, సాధికారతకు భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొన్నారు. మహిళలకు సమావేశాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఇది వేదికగా నిలుస్తుందని తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని సర్పంచ్ శివరాజ్ అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రవి, ఫీల్డ్ అసిస్టెంట్ సుబాకర్, వార్డు సభ్యులు ప్రకాష్, శారదమ్మ, మాజీ వార్డు సభ్యులు విష్ణు, దప్పూర్ బీరయ్య, ఆలయ సభ్యులు సతీష్ గౌడ్, ప్రభు, సిద్ధయ్య, మల్లయ్య, మహిళా సభ్యురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ, చేసిన ఏఎంసి చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి



జహిరాబాద్ వాయిస్ టుడే సెప్టెంబర్09: సంగారెడ్డిజిల్లామునిపల్లి మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ పంచాయతీ. కార్యాలయంలో, గ్రామంలో ఉన్న లబ్ధిదారులుకు, స్మార్ట్ రేషన్ కార్డు పంపిణి చేయడం జరిగింది,వారు మాట్లాడుతు.దేశంలోనే, ఏ రాష్టంలో లేని,మన రాష్టంలో నే నిరుపేదలందరికి సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుంది అని పేదోడు ఆకలితో,ఉండొద్దు అని లక్ష్యంతో,కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది అని తెలిపారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్.అశోక్, ఉపసర్పంచ్, జిపిఓ, వైలుగుగ్రామఖ్య సంగం. సభ్యులు.నాయకులు.ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐదు పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలి

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి పొదెం వీరయ్య వినతి



భద్రాచలం, సెప్టెంబర్ 09 : భద్రాచలం సరిహద్దు లో ఆంధ్రా లో కలిసిన ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణ తిరిగి విలీనం చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ను మాజీ ఎమ్మెల్యే, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య కోరారు. భద్రాచలం, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే, రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన యటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలని వీరయ్య విజ్ఞప్తి చేసారు . బుధవారం భద్రాచలం విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను ఐటీసీ అతిథి గృహం లో కలిసి వీరయ్య వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ, రాష్ట్ర విభజన అనంతరం భద్రాచలం చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామపంచాయతీలను ఆంధ్రప్రదేశ్‌లో లివిలీనం చేయడం వల్ల భద్రాచలం పట్టణం భౌగోళికంగా, పరిపాలనా పరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నదని అన్నారు. భద్రాచలం పట్టణానికి అనుబంధంగా ఉన్న గ్రామాలు మరో రాష్ట్రంలో ఉండటంతో ప్రజలు నిత్యావసర పరిపాలనా సేవల కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ఐదు గ్రామపంచాయతీ లు ఆంధ్రా లో విలీనం కారణంగా చెత్త డంపింగ్ కు కూడా సరైన స్థలం లేక గోదావరి నదిలో వ్యర్థాలు పడవేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. విద్యా సంస్థల ఏర్పాటులో ఇబ్బందులు, భద్రాచలంలో శ్మశాన వాటిక/బరియల్ గ్రౌండ్ కు స్థలం కొరత, పర్ణశాల వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలకు రాకపోక ల్లో సమస్యలు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యంగా శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన సుమారు 900 ఎకరాల భూమి ఐదు గ్రామపంచాయతీ ల విలీనం కారణంగా ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో దేవస్థానం భూములను సమర్థవంతంగా వినియోగించుకోవడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం కష్టతరంగా మారిందని తెలిపారు. దేవస్థాన భూములపై ఆక్రమణలు జరుగుతున్నా, పరిపాలనా పరిధి మరో రాష్ట్రంలో ఉండటంతో వాటిని అరికట్టడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కేంద్ర మంత్రికి వివరించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం,

భద్రాచలం ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని, ఆంధ్రప్రదేశ్ లో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం రెవెన్యూ డివిజన్ లో విలీనం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పొదెం వీరయ్య కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర హోంశాఖ ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, భద్రాచలం ప్రజల దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఆశిస్తున్నట్లు పొదెం వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమం భద్రాచలం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిమి శ్రీనివాసరావు , సీనియర్ నాయకులు తమ్మళ్ళ వెంకటేశ్వరావు, వాసిరెడ్డి సాంబశివరావు, కొలపూడి వరుణ్, కాపుల శ్రీను పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**రాజీయే రాజ మార్గము**
**హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు**



హుజూర్ నగర్: సెప్టెంబర్ 09 (వాయిస్ టుడే ప్రతిది): ఈనెల12 వతేది శనివారంజరిగే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హుజూర్ నగర్ సీఐ జి చరమందరాజు అన్నారు. బుధవారం సీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, డ్రంకన్ డ్రైవ్ కేసులు, మోటారు ట్రాన్స్పోర్ట్ రోడ్డు నిభందనలు ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ ఇలా రాజిపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ చేసుకోవచ్చు అని తెలిపిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృదా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు సంభందిత పోలీస్ అధికారు లను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది సీఐ చరమంద రాజు అన్నారు.



## సియం చంద్రబాబు నాయుడే మా నాయకుడు : బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి (వాయిస్ టుడే)సెప్టెంబర్ 09: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్ట్ చేసి నేటి బుధవారం మూడేళ్లు పూర్తైయింది. ఈ సందర్భంగా 'నిజం గెలిచింది' పేరుతో పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ లెవల్‌లో దీపాలు వెలిగించాలని, ఈరోజు బ్లాక్ డే పాటించాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడంతో శ్రీకాళహస్తిలో రాష్ట్ర పిలుపుమేరకు శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి వజ్రాల బృందమ్మ వారి స్వగ్రామం ఊరందరు గ్రామంలోని అలనాటి అరెస్టును వ్యతిరేకిస్తూ నిజం గెలిచింది అనే నినాదంపై కొవ్వొత్తులతో దీపం వెలిగించి , ఈ దీపం వెలుగులో కూటమి ప్రభుత్వంతోపాటు ప్రజలు సువిక్షంగా ఉండాలన్నారు బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ లిఅప్పటి ప్రతిపక్ష నేత నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు నేటితో మూడేళ్లు: ప్రజాస్వామ్య చరిత్రలో నల్లరోజులిఅని ప్రతీ తెలుగువాడి గుండె ఘోషించింది.ఈ దృశ్యం చూసి కన్నీళ్లు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అది కేవలం ఒక అరెస్ట్ కాదని ప్రజల మనసులను తాకిన ఒక చేదు జ్ఞాపకమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా అర్ధరాత్రి వేళ ఓ ప్రజా నాయకుడిని నిర్బంధించడం ఆంధ్రప్రదేశ్ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక అత్యంత చీకటి రోజు అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు వ్యతిరేకిస్తూ ఒక్కసారిగా వైకాపా పార్టీకి ప్రజలే సరైన 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధి చెప్పారన్నారు. ఏ తప్పు చేయని నాయకుడిని ఇబ్బంది పెడితే ప్రజలు ఊరుకోరని, ఆ అక్రమ నిర్బంధానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా తెలరేగిన ప్రజా ఉద్యమమే దానికి నిదర్శనమన్నారు నాడు చంద్రబాబు జరిగిన అక్రమ దాడికి, అక్రమ నిర్బంధానికి వ్యతిరేకంగా శ్రీకాళహస్తి గడ్డపై బొజ్జల కుటుంబం, టిడిపి శ్రేణులు ఎప్పుడూ మొదటి వరుసలో నిలబడి పోరాటం చేశాయని, రాబోయే రోజుల్లో కూడా చంద్రబాబు గారి నాయకత్వంలో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తామని ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ స్పష్టం చేశారు.

# ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన నరాటి ప్రసాద్

భద్రాచలం, సెప్టెంబర్ 09 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి ప్రాంతానికి చెందిన నరాటి ప్రసాద్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసారు. నరాటి ప్రసాద్ చిన్న వయసులోనే ప్రజా ఉద్యమాల వైపు అడుగులు వేశారు. పదో తరగతిలోనే విద్యార్థి ఉద్యమంలో పాల్గొని తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. విద్యార్థి ఉద్యమం నుంచి ప్రజా ఉద్యమాల వరకు విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. అనంతరం కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ సీపీఐ మండల కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. విశాలాంధ్ర, ఆంధ్రప్రభ, ప్రజాశక్తి వంటి పత్రికల్లో ములకలపల్లి, పాల్వంచ ప్రాంతాల్లో విలేకరిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారు.

**భూ పోరాటాలు – పేదల పక్షాన ఉద్యమాలు**

సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజనుల భూ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. భూమి లేని గిరిజనులకు భూములు దక్కేలా ఉద్యమాలు నిర్వహించి, వేలాది ఎకరాల భూముల పంపిణీకి పోరాటం చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఇండ్ల స్థలాలు లేని పేదల కోసం పోరాటాలు నిర్వహించి, వారికి ఇండ్ల స్థలాలు, ఇళ్ల కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చారు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు గుర్తుకొచ్చే నాయకుడిగా నరాటి ప్రసాద్‌కు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. తమ సమస్య ఏదైనా ప్రసాద్‌ను ఆశ్రయిస్తే పరిష్కారం కోసం ఆయన ముందుండి పోరాడుతారనే నమ్మకం ప్రజల్లో ఏర్పడింది.

**కరోనా కాలంలో ప్రజలకు అండగా**

కరోనా మహమ్మారి సమయంలో సుమారు 100 రోజుల పాటు అన్ని గ్రామాల్లో ప్రజలకు ఆహారం, నిత్యావసర సరుకులు అందిస్తూ, ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలిచారు. అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేశారు.

**కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం**



కార్మికులను సంఘటితం చేయడంలోనూ నరాటి ప్రసాద్ కీలక పాత్ర పోషించారు. హమాలీ, బిల్డింగ్ వర్కర్స్, గ్రామపంచాయతీ కార్మికులు, అంగన్వాడీ, ఆశా, వంట కార్మికులు, వీవోఏ, ఆర్పీ, విద్యుత్ కార్మికులు తదితర రంగాల్లో కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించారు.

**మినీ అంగన్వాడీ ఉద్యోగుల కోసం చారిత్రాత్మక పోరాటం**

తెలంగాణలోని మినీ అంగన్వాడీ టీచర్లను సంఘటితం చేసి, వారి వేతనాల పెంపు, పదోన్నతుల కోసం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లారు. భద్రాచలం నుంచి కొత్తగూడెం వరకు పాదయాత్ర, అనంతరం హైదరాబాద్ వరకు ఉద్యమాలు నిర్వహిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కతో చర్చలు జరిపి మినీ అంగన్వాడీ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఈ ఉద్యమాల ఫలితంగా రాష్ట్రంలోని సుమారు 4,200 మంది మినీ అంగన్వాడీ టీచర్లకు పదోన్నతులు, అలాగే రూ.6,500 నుంచి రూ.13,650కు వేతన పెంపు సాధించడంలో నరాటి ప్రసాద్ కృషి ఉందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

**ఏఐటీయూసీ అభివృద్ధిలో కీలక బాధ్యతలు**

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ జిల్లాలో కార్మిక ఉద్యమాన్ని విస్తరించేందుకు కృషి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో అంగన్వాడీ, విద్యుత్, సెర్ఫ్, మెప్మా తదితర రంగాల్లో ఏఐటీయూసీని బలోపేతం చేయడంతో పాటు కొత్త కార్మికులను సంఘంలోకి తీసుకురావడానికి బాధ్యతలు చేపట్టి పనిచేస్తున్నారు.

**రాజకీయ రంగంలోనూ క్రియాశీల పాత్ర**

సీపీఐ నాయకుడిగా వివిధ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. మాజీ ఎమ్మెల్యే కుంజా బిక్షం, మాజీ ఎంపీ సోడే రామయ్య విజయాల కోసం పనిచేశారు.

పాల్వంచలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గారి విజయానికి 20 పోలింగ్ బూత్‌లకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించి అధిక ఓటింగ్ కోసం కృషి చేశారు. పాల్వంచ 44వ డివిజన్ కార్పొరేటర్ విశ్వం విజయానికి కూడా తీవ్రంగా కృషి చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా కొనసాగుతున్న నరాటి ప్రసాద్, ప్రజా ఉద్యమాలతో పాటు కార్మిక ఉద్యమంలోనూ తనదైన ముద్ర వేశారు.

**ఆధ్యాత్మిక, సామాజిక సేవలోనూ ముందంజ**

ములకలపల్లిలో భారీ శివాలయ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి, ప్రస్తుతం ఆలయ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. సామాజిక, సేవా కార్యక్రమాల ద్వారా కూడా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

**ఉద్యమమే ఊపిరిగా... ప్రజలే బలంగా...**

విద్యార్థి ఉద్యమం నుంచి కార్మిక ఉద్యమం వరకు, గిరిజనుల భూమి పోరాటాల నుంచి పేదల ఇండ్ల స్థలాల ఉద్యమాల వరకు, కరోనా సమయంలో సేవా కార్యక్రమాల నుంచి అంగన్వాడీ ఉద్యోగుల హక్కుల పోరాటం వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ వచ్చిన నరాటి ప్రసాద్‌కు ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కొత్త బాధ్యతలు దక్కడం కార్మిక ఉద్యమానికి మరింత బలాన్నిస్తుందని జిల్లా నాయకులు, కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**